

# నాసిరకం నాణ్యత లోపంతో సీసీ రోడ్ల నిర్మాణం!

బురదలో పోసిన పన్నీరులా ప్రజాధనం వృథా ?

నాణ్యతపై ప్రశ్నలు పర్సంటేజీల పాకులాటపై ప్రజల్లో అనుమానాలు !




గురువారం 13 ఆగస్టు 2026 పేజీలు : 8

# పుస్తక పఠనంతోనే సమాజంలో ఉన్నత స్థానాలు సాధ్యం


**జందాపూర్ గ్రామంలో నూతన గ్రంథాలయం ప్రారంభం : జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకున్న వారే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరో హిస్తారని, గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయా న్ని కలెక్టర్ ప్రారంభించారు.

# దివాకర్ రావు పాలనలోనే మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధికి దూరం



బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు

నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

# అర్హులందరికీ పారదర్శకంగా 'చేయూత' పింఛన్లు అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శ కంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

# ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి



# సింగరేణి 2025--26 ఆర్థిక సంవత్సర లాభాలు వెంటనే ప్రకటించాలి

**టీబీజీకే ఎస్ నాయకుల డిమాండ్**

**మంచిర్యాల, 12, ఆగస్టు ( ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సాధించిన వాస్తవ నికర లాభాలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి 5 నెలలు గడుస్తున్నా సంస్థ లాభాలను వెల్లడించకపోవడం దుర్మార్గమని సంఘం నాయకులు బుధవారం విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రతి మూడు నెలలకు ఒకసారి తమ ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నప్పటికీ, సింగరేణి యాజమాన్యం మాత్రం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి అసలు లాభాలు వచ్చాయా? లేదా? అనే విషయంపై యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరారు.దేశంలోని మహారత్న, మినీరత్న సంస్థలతో పాటు కోల్ ఇండియా వంటి సంస్థలు ఇప్పటికే 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను ప్రకటించడంతో పాటు, ప్రస్తుత 2026--27 ఆర్థిక సంవత్సరంలోని తొలి త్రైమాసిక ఫలితాలను కూడా వెల్లడించాయని తెలిపారు. అయితే సింగరేణి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం, గుర్తింపు పొందిన ప్రాతినిధ్య



సంఘాలు స్పందించక పోవడం శోచనీయ మన్నారు.సింగరేణి యాజమాన్యం ఇకనైనా ఆలస్యం చేయకుండా 2025--26 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన వాస్తవ నికర లాభాలను వెంటనే కార్మికులు, ప్రజలకు తెలియజేయాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పెట్టం లక్ష్మణ్, కేంద్ర సంయుక్త కార్యదర్శులు పొగాకు రమేష్, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎండిలాల, గడ్డం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దివాకర్ రావు పాలనలోనే మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధికి దూరం



**బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**

**మంచిర్యాల, 12,ఆగస్టు (ప్రజాజ్యోతి):** మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు 20 ఏళ్ల పాలనలో మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధిలో వెనుక బడిందని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుడు విజిత్ రావు ఇటీవల బీజేపీపై, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. మంచిర్యాల పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయం లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ఎల్లంపల్లి ప్రాజెక్టును తానే సాధించానంటూ దివాకర్ రావు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. ప్రాజెక్టు సాధన కోసం ఆయన చేసిన పోరాటం ఏమిటో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. కనీసం ఒక్క ధర్నా, ఒక్క వినతిపత్రం సమర్పించారా అని నిలదీశారు. ఎల్లంపల్లి ముంపు బాధితుల సమస్యలను పరిష్కరించడంలో దివాకర్ రావు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముంపు బాధితులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం చెల్లించా లని రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ నాయకులు ఆందోళనలు చేపట్టిన సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రఘునాథ్‌పై అక్రమ కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. రైతుల సమస్యలపై రఘునాథ్ చేసిన పోరాటాలను విజిత్ రావు తెలుసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతుల నుంచి కోతలు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపిస్తూ దండేపల్లి నుంచి మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ వరకు రఘునాథ్ వెరబెల్లి పాదయాత్ర నిర్వహించి రైతుల పక్షాన పోరాడారని వెంకటేశ్వర్ గౌడ్ గుర్తు చేస్తూ తెలిపారు. గూడెం ఎత్తిపోతల పథకం పైపులు తరచూ పగిలిపోతున్న సమయంలో వాటిని మార్చాలని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ఘనత కూడా రఘునాథ్‌కే దక్కుతుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ల గడిచిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు రైతుల కోసం పోరాడుతున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు గత బీఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలే కారణమని విమర్శించారు.కేరళ, తమిళనాడు పంజాబ్ రాష్ట్రాల్లో బీజేపీ ఎందుకు అధికారంలోకి రావడం లేదని విజిత్ రావు ప్రశ్నించడంపై వెంకటేశ్వర్ గౌడ్ స్పందిస్తూ.. బీజేపీకి బీఆర్ఎస్ నుంచి ఎలాంటి రాజకీయ సలహాలు అవసరం లేదని, ఏ రాష్ట్రంలో ఎప్పుడు ఎలా అధికారంలోకి రావాలో తమ పార్టీ అగ్ర నాయకత్వానికి తెలుసని స్పష్టం చేశారు.బీజేపీపై లేదా రఘునాథ్ వెరబెల్లిపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వెంకటేశ్వర్ గౌడ్ హెచ్చరించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, మంచిర్యాల నియోజకవర్గంలో రఘునాథ్ వెరబెల్లి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో పెద్దపల్లి పురుషోత్తం, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, జయరామ రావు, కమలాకర్ రావు, కుర్రే చక్రవర్తి, రంగ శ్రీశైలం, ఆడే ప్రేమ్ సింగ్, కల్వచర్ల అనీల్, దేవరకొండ వెంకన్న, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో 45 రోజుల ఉపాధి నైపుణ్య శిక్షణ

**మంచిర్యాల, 12,ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రాంతీయ కేంద్రం మంచిర్యాల ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యార్థులు, ఉద్యోగావకాశాలు కోరుకునే అభ్యర్థుల కోసం 45 రోజుల ఉపాధి సంపాదన నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంచిర్యాల ప్రాంతీయ కేంద్రం మేనేజర్ పి. రాకేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 24 నుంచి ప్రారంభమ వుతుందని అన్నారు. అభ్యర్థుల్లో ఉద్యోగానికి అవసరమైన సాంకేతిక, మృదు నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ప్రాయోగిక శిక్షణ అందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఐటీ, సేవా రంగాల్లోని వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలను పొందేందు కు అవసరమైన నైపుణ్యాలను అభ్యర్థులకు అందించ నున్నట్లు తెలిపారు.శిక్షణలో సీ ప్రోగ్రామింగ్, హెచ్‌టీఎంఎల్--సీఎస్ఎస్, జావా, పైథాన్, ఆప్టిట్యూడ్--రీజనింగ్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు.శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 13న ప్రారంభమై, ఆగస్టు 19 తో ముగుస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలను మంచిర్యాలలోని ఐడీఓసీ భవనంలోని గది నంబర్--జీ13లో సమర్పించాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం 7989733351, 9676535290 నంబర్లలో సంప్రదించాలని కోరారు. జిల్లాలోని ఆసక్తి గల విద్యార్థులు, ఉద్యోగావకాశాలు కోరుకునే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ ప్రాంతీయ కేంద్రం మేనేజర్ పి. రాకేష్ కోరారు.

## ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలి

**ప్రిన్సిపల్ డాక్టర్ రామక పాండురంగ శర్మ**

**ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం**



**మంచిర్యాల, 12,ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గ్రంథాలయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ 134వ జయంతిని పురస్కరించు కుని కళాశాల గ్రంథాలయ అధికారిణి డాక్టర్ ఎన్. పద్మారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామక పాండురంగ శర్మ గారు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని, తద్వారా విజ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని సూచించారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గ్రంథాలయ అధికారిణి డాక్టర్ ఎన్. పద్మారాణి మాట్లాడుతూ, జాతీయ గ్రంథాలయ దినోత్సవం ప్రాముఖ్యతను, డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ గ్రంథాలయ రంగానికి అందించిన సేవలను వివరించారు. పుస్తకాలు విద్యార్థుల జ్ఞానాన్ని విస్తృతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# చెరువు మింగేస్తున్న అక్రమార్కులు! చోద్యం చూస్తున్న అధికారులు!

**మంచిర్యాలరూరల్ ఆగష్టు12(ప్రజాజ్యోతి)**చెరువులు పట్టణాలకు ఊపిరితిత్తుల్లాంటివి. వర్షపు నీటిని ఒడిసిపట్టి,వరద ముప్పును తగ్గించే సహజ వనరులు.కానీ ఇదే చెరువులు కబ్జాదారుల చేతుల్లో చిక్కితే పరిస్థితి ఎలా ఉంటుందో మంచిర్యాల పట్టణంలోని వర్షాకాలంలో జరిగిన పలు సంఘటనలు ప్రశ్నిస్తున్నాయి.నస్పూర్ పట్టణ పరిధిలోని చింతల చెరువు సుమారు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు స్థానికుల సమాచారం.ఇంతటి విస్తీర్ణం ఉన్న చెరువును పరిరక్షించాల్సిన అధికారులు అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా చెరువు పరిధిలోని కొన్ని ప్రాంతాలను చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**--ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలా?**

చెరువు పూర్తి స్థాయి హద్దులు,ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్‌లను స్పష్టంగా గుర్తించి సంరక్షించాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులపై ఉంది. కానీ ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయనే సమాచారం తెలిసిన అధికారులు క్షేత్రస్థాయిలో ఏం పరిశీలిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.నిర్మాణం మొదలైన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే,నిర్మాణం ప్రారంభం కాకముందే అడ్డుకోవడం అధికారుల బాధ్యత కాదా?అన్నది ప్రజల ప్రశ్న.

**నిర్మాణాలు తుదిదశకు!పర్మిషన్ కోసం వేట**

అక్రమ నిర్మాణం చేపట్టి,తదుపరి తంతు మున్సిపాల్ కార్పొరేషన్ నుండి ఇంటి నంబర్,భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడితే అది మరింత తీవ్రమైన సమస్యగా మారుతుంది.అందువల్ల చింతల చెరువు పరిధిలో ఇప్పటివరకు ఎన్ని భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని అనుమతులు మంజూరయ్యాయి?ఎన్ని ఇంటి నంబర్లు ఇచ్చారు? ఆయా స్థలాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లకు బయట ఉన్నాయని ఎవరు నిర్ధారించారు? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**మూడు శాఖల సమన్వయ లోపం!**

చెరువుల పరిరక్షణలో ఇరిగేషన్,రెవెన్యూ, మున్సిపల్ శాఖలు కీలకం.ఇరిగేషన్ శాఖ చెరువు హద్దులు,ఎఫ్‌టీఎల్ వంటి అంశాలను పరిశీలించాలి.రెవెన్యూ శాఖ భూమి రికార్డులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై దృష్టి పెట్టాలి. మున్సిపల్ అధికారులు నిర్మాణ అనుమతులు, ఇంటి నంబర్ల విషయంలో నిబంధనలు పాటించాలి.ఈ



మూడు శాఖలు సమన్వయంతో పనిచేస్తే చెరువు ఆక్రమణలకు అవకాశం ఉండదు.మరి చింతల చెరువు విషయంలో సమన్వయం ఎంతవరకు ఉంది? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

**--చెరువు మాయమైతే!వర్షపు నీరుకు దారేది?**

చెరువుల సహజ విస్తీర్ణం తగ్గిపోతే దాని ప్రభావం కేవలం చెరువు వరకే పరిమితం కాదు.భారీ వర్షాల సమయంలో నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోతే లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరే ప్రమాదం ఉంటుంది.అప్పుడు ప్రజలు ఇబ్బందులు పడిన తర్వాత అధికార యంత్రాంగం స్పందించడం వల్ల ప్రయోజనం ఏమిటి? చెరువులను ముందుగానే కాపాడటం ఎందుకు సాధ్యం కావడం లేదన్నదే ప్రజల ప్రశ్న.

**--చెరువు పునరుద్ధరణకు నోచుకునేనా?**

చింతల చెరువుకు సంబంధించిన సర్వే నంబర్లు,మొత్తం విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ స్థాయి,బఫర్ జోన్ హద్దులు,గతంలో జరిగిన సర్వేలు, ఆక్రమణలపై తీసుకున్న చర్యలు,తొలగించిన నిర్మాణాల వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలి.అదేవిధంగా చెరువు పరిధిలో కొత్తగా నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతాలను సంయుక్తంగా పరిశీలించి,నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.చెరువు కబ్జాకు గురైన వెంటనే చర్యలు తీసుకోవడం తగవు..కబ్జా జరగకుండా చూడటమే అసలైన పరిపాలన.చింతల చెరువు విషయంలో ఇప్పటికైనా ఇరిగేషన్, రెవిన్యూ,మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మేల్కొని చెరువు హద్దులను నిర్ధారించి,నాలుగు వైపులా స్పష్టమైన బౌండరీలు ఏర్పాటు చేసి,ఆక్రమణలకు శాశ్వత అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## గర్భిణీల గుండెల్లో గుబులు!వైద్యుల పట్టింపు కరువు!

**మంచిర్యాలరూరల్ ఆగష్టు12(ప్రజాజ్యోతి)** మంచిర్యాల పట్టణంలోని గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం పరిసరాల పరిస్థితిపై రోగులు,వారి కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణీలు,బాలింతలు,చిన్నారులకు వైద్యం అందాల్సిన ప్రాంతం పరిశుభ్రతకు దూరంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు.ఆసుపత్రి భవనం చుట్టూ పిచ్చిమొక్కలు విపరీతంగా పెరగడంతో పాటు అక్కడక్కడా చెత్తాచెదారం పేరుకుపోయినట్లు తెలుస్తోంది.దీంతో ఆసుపత్రి పరిసరాలు ఆహ్లాదకరమైన వాతావరణానికి బదులుగా అపరిశుభ్రతకు నిలయంగా మారాయని రోగుల కుటుంబసభ్యులు వాపోతున్నారు.

**--వర్షాకాలం వచ్చిందంటే భయం..**

పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం మధ్య విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని గర్భిణీల కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పాములు,తేళ్లు,ఇతర విష పురుగులు ఆసుపత్రి పరిసరాల్లోకి వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు.వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే సమయంలోనే ఇలాంటి భయాందోళనలకు గురికావాల్సి వస్తోందని పలువురు అంటున్నారు.

**--పేదలకు ప్రభుత్వ ఆసుపత్రే దిక్కు**

ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం ఖర్చులు భరించలేని మధ్యతరగతి,పేద కుటుంబాలు ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారు.అలాంటి వారికి ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో మెరుగైన వైద్యంతో పాటు కనీస పరిశుభ్రత,భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**--పరిశుభ్రతపై పర్యవేక్షణ ఏదీ?**

ఆసుపత్రి పరిసరాల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయా?చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారా? పిచ్చిమొక్కలను ఎందుకు తొలగించడం లేదనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు వచ్చే ప్రాంతంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం అధికారుల పర్యవేక్షణపై సందేహాలను కలిగిస్తోందని పలువురు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా మేల్కొని మాతా శిశు ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని,పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పూర్తిగా తొలగించాలని రోగులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు.వర్షాకాలం నేపథ్యంలో విషపురుగుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గర్భిణీలకు భరోసా ఇవ్వాల్సిన ఆరోగ్య కేంద్రం.. భయాందోళనకు కారణంగా మారకూడదని, అధికారులు తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## వాగులో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

**ఆడుకుంటూ వెళ్లి.. తిరిగిరాని లోకాలకు**

**ధనోర్ వాగులో ప్రమాదవశాత్తు జారిపడి విషాదాంతం**



**కెరమెరి ఆగష్టు 12 ప్రజా జ్యోతి** ఆడుకుంటూ వాగు వద్దకు వెళ్లిన నాలుగేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన విషాద ఘటన కెరమెరి మండలంలో చోటుచేసుకుంది. ధనోర్ గొందుగూడకు చెందిన ఆత్రం లక్ష్మి (4) బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని ధనోర్ వాగు వద్ద ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయింది.చిన్నారి నీటిలో పడిపోయిన విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమయ్యారు. నీటిలో నుంచి చిన్నారిని బయటకు తీసి హుటాహుటిన ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**కుటుంబంలో విషాదఛాయలు**

చిన్నారి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటివరకు ఇంటి వద్ద సందడిగా ఉన్న చిన్నారి ఒక్కసారిగా మృత్యువాత పడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఘటన విషయం తెలుసుకున్న స్థానికులు సైతం దిగ్భ్రాంతికి గురయ్యారు.

**గ్రామంలో విషాదం**

నాలుగేళ్ల పసికందు వాగులో మునిగి మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. వర్షాకాలంలో వాగులు, వంకల వద్ద చిన్నారులు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. ఈ ఘటనతో ధనోర్ గొందుగూడలో విషాద వాతావరణం నెలకొంది.

## పాత అగర్వాడలో బోరింగ్ మరమ్మతు



**ఆసిఫాబాద్ ఆగష్టు 12 ప్రజా జ్యోతి** కెరమరి మండలం లోని అగర్వాడ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అగర్వాడ గ్రామపంచాయతీ పరిధిలోని పాత అగర్వాడలో పనిచేయకుండా ఉన్న బోరింగ్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. బోరింగ్ చెడిపోవడంతో కొంతకాలంగా స్థానికులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు. బోరింగ్ మరమ్మతు పూర్తికావడంతో నీటి సరఫరా అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని సర్పంచ్ వద్దురే రోజా సోనాజీ తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. బోరింగ్ మరమ్మతు పనులు పూర్తిచేయడంతో స్థానిక ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# జన్నారంలో కన్నుల పండువగా 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ



**జన్నారం,ఆగస్ట్12(ప్రజాజ్యోతి)** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ, దేశభక్తి భావనను చాటిచెప్పేలా జన్నారం మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ధర్మారం చౌరస్తా నుండి ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ తెలంగాణ తల్లి విగ్రహం వరకు సాగింది. వివిధ పాఠశాలల విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు చేతబూని "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" అంటూ చేసిన నినాదాలతో జన్నారం పురవీధులు మారుమోగాయి. మువ్వన్నెల జెండాల శోభతో వీధులన్నీ దేశభక్తి పరవశంలో మునిగిపోయాయి.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నతనం నుంచే పిల్లల్లో జాతీయ భావాలను పెంపొందించడంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శులు రమేష్, జగన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కొంతం శంకరయ్య, ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు బద్రి నాయక్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బెడద గోపాల్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పవన్ యాదవ్, జిల్లా నాయకుడు గోలి చందు, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు బోడ తిరుపతి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కందుల రమేష్, సర్పంచులు లక్ష్మిరాజం, వాసాల నరేష్, పొనకల్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి, బూత్ అధ్యక్షులు యుగంధర్, పట్టణ అధ్యక్షులు సూర్యం,సత్తయ్య, వేయికండ్ల రవి తదితరులు పాల్గొన్నారు

# నూతన జీఎం సెక్యూరిటీకి ఘన సత్కారం



**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):**సింగరేణి కాలరీస్ బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్అండ్‌పీసీ డిపార్ట్‌మెంట్ కార్పొరేట్ ఫిట్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా జనరల్ మేనేజర్ సెక్యూరిటీగా బాధ్యతలు స్వీకరించిన అజయ్ కుమార్ ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు పూలగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల నుంచి సెక్యూరిటీ గార్డులుగా అంతర్గత నియామకాలు చేపట్టాలని జీఎం సెక్యూరిటీని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, జమ్మేదార్ల పోస్టులను కూడా త్వరితగతిన భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగుల భద్రత, సెక్యూరిటీ విభాగం బలోపేతానికి సంబంధించిన ఈ అంశాలపై జీఎం సెక్యూరిటీ అజయ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఏ. నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ నల్లపూరి రమేష్, కార్పొరేట్ బ్రాంచ్ డిప్యూటీ జనరల్ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ గోలి వెంకటేశ్వర్లు, బ్రాంచ్ కమిటీ నాయకులు జల్లారం శ్రీనివాస్, కొత్త శ్రీనివాసరావు, బొంతు శ్రీనివాస్, బి. సురేష్, టీ. కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఫిట్ కమిటీ నాయకులు జి. హనుమంత రాజు, జి. సతీష్, కుక్కల శ్రీనివాసరావు, కే. శివకుమార్, డి. నరేష్, ఆర్. శ్రీనివాసరావు, వి. ప్రభాకర్, ఆర్. చంద్రశేఖర్, సిహెచ్. రమేష్, ఆర్. రాజ కొమురయ్య ఆర్. నరేష్, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## పల్లె ప్రకృతి వనంలో క్షుద్రపూజల కలకలం

## భయాందోళనలో గ్రామస్థులు



**జన్నారం,ఆగస్ట్12(ప్రజాజ్యోతి)** మండలంలోని కామన్ పల్లి పల్లె ప్రకృతి వనంలో క్షుద్రపూజల కలకలం రేగింది. పచ్చటి చెట్లతో ప్రశాంతంగా ఉండే ప్రకృతి వనం ఒక్కసారిగా భయాందోళనలకు కేంద్రబిందువుగా మారింది. వనంలోని ఓ భారీ వృక్షానికి పసుపు, ఆకుపచ్చ రంగుల్లో ఉన్న వింత బొమ్మలను ఇనుప మేకులతో దిగ్బంధించి ఉండటాన్ని స్థానికులు ఉదయం గుర్తించారు.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...రోజువారీలాగే వనం వైపు వెళ్లిన కొంతమందికి ఒక పెద్ద చెట్టుకు ఉన్న క్షుద్రపూజల ఆనవాళ్లు కనిపించాయి.మానవ ఆకారాలను పోలి ఉన్న పసుపు,ఆకుపచ్చ రంగు బొమ్మలను మేకులతో చెట్టుకు గుచ్చినట్లు గమనించారు.పూజల తరహాలో మేకులు కొట్టి ఉండటంతో ఇవి మూఢనమ్మకాలతో చేసిన క్షుద్రపూజలేనని స్థానికులు బలంగా అనుమానిస్తున్నారు.అర్ధరాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు వనంలోకి ప్రవేశించి ఈ చర్యలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.ఈ విషయం గ్రామంలో వ్యాపించడంతో పల్లె ప్రకృతి వనానికి వెళ్లేందుకు గ్రామస్థులు,పంచాయతీ సిబ్బంది తీవ్రంగా భయపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం వచ్చే వారు,మొక్కల పెంపకం మరియు నీళ్లు పోసేందుకు వచ్చే పంచాయతీ కార్మికులు లోపలికి అడుగుపెట్టేందుకు వెనకాడుతున్నారు.ఈ ఘటనతో కామన్ పల్లిలో ఒక రకమైన భయాందోళన వాతావరణం నెలకొంది.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను ఇలాంటి అసాంఘిక,మూఢనమ్మకాల కార్యకలాపాలకు వేదికగా మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ పంచాయతీ అధికారులు,పోలీసులు తక్షణమే స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.రాత్రి వేళల్లో వనం వద్ద పెట్రోలింగ్ నిర్వహించి,ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కామన్ పల్లి గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అర్హులందరికీ పారదర్శకంగా 'చేయూత' పింఛన్లు అందించాలి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 12 ,( ప్రజాజ్యోతి ).** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శ కంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, అర్హతల పరిశీలనతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, వనమహోత్సవం, తెలంగాణ జలసిరి కార్యక్రమాల అమలు పురోగతిపై సమీక్ష నిర్వహించి అధికారులకు కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.కొత్త చేయూత పింఛన్ల కోసం ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల ప్రజలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎక్కడా పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ప్రారంభించి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. తెలంగాణ జలసిరి పథకం కింద సోక్ పిట్లు, బోర్‌వెల్లు, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు గుర్తించిన దుకాణాలను సీజ్ చేయాలనీ, భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శిథిల పాఠశాల భవనం.. విద్యార్థుల భద్రత గాలిలో!

## గిరిజన గ్రామాల్లో విద్యా వసతులు అందని ద్రాక్ష..

## వెంటనే కొత్త భవనం నిర్మించాలి



**ఆసిఫాబాద్ ఆగస్టు 12 ప్రజా జ్యోతి**గిరిజన గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ ఆరోపించారు. కెరమెరి మండలం ఇందాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలలో సుమారు 86 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నప్పటికీ, వారి సంఖ్యకు సరిపడా తరగతి గదులు, ఉపాధ్యాయులు, సురక్షితమైన భవనం వంటి కనీస సౌకర్యాలు లేవన్నారు. ప్రస్తుతం ఉన్న భవనం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉందని, అధికారులు తక్షణమే పరిశీలించి నూతన పాఠశాల భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ సమస్యలపై ఇందాపూర్ గ్రామ సర్పంచ్, గ్రామస్తులతో కలిసి కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి సదానందం చారికి వినతిపత్రం అందజేశారు.గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దినకర్ కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సంయుక్త కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి, ఇందాపూర్ సర్పంచ్, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం నాణ్యత లోపంతో సీసీ రోడ్ల నిర్మాణం!

## బురదలో పోసిన పన్నీరులా ప్రజాధనం వృథా ?

## నాణ్యతపై ప్రశ్నలు పర్సంటేజీల పాకులాటపై ప్రజల్లో అనుమానాలు !



**కొమరం భీమ్ జిల్లా బ్యూరో ప్రతినిధి । ఆగస్టు 12 । ప్రజా జ్యోతి** కొమురం భీం జిల్లా కేంద్రంలో ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోంది. అయితే కొన్ని గ్రామాల్లో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతపై తీవ్ర ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని నాసిరకం పనులు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైకి చూస్తే సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయినట్టుగా కనిపిస్తున్నా కొద్ది కాలానికే పగుళ్లు, గుంతలు ఏర్పడటం, కాంక్రీట్ నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు

**పనుల నాణ్యతపై పర్యవేక్షణ ఎక్కడ ?**

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి నిర్మాణ పనికి నాణ్యతా ప్రమాణాలు సాంకేతిక పర్యవేక్షణ తప్పనిసరి కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తయ్యే వరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్ ఇసుక, కంకర నాణ్యత, కాంక్రీట్ మిశ్రమం రోడ్డు మందం తదితర అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ ఎంతవరకు అమలవుతోందనే దానిపై ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి పర్సంటేజీల పాకులాటపై ఆరోపణలు స్థానికంగా కొందరు రాజకీయ నాయకులు కాంట్రాక్టర్లు సంబంధిత వ్యక్తుల మధ్య ముడుపులు పర్సంటేజీల వ్యవహారం నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. ఆరోపణలు నిజమైతే ప్రజాధనాన్ని కాపాడాల్సిన వ్యవస్థలోనే అవినీతికి తావిచ్చినట్లవుతుంది. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులు కాగితాలపై ఖర్చయినట్లు చూపించి క్షేత్రస్థాయిలో నాణ్యత లేని పనులు జరిగితే చివరికి నష్టపోయేది ప్రజలే. ఒకే రోడ్డు పదేపదే మరమ్మతులకు గురైతే ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతుంది. నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలి జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. పూర్తయిన రోడ్లకు సాంకేతిక బృందాలతో నాణ్యతా పరీక్షలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ ధనం ప్రజల సొమ్ము. ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనానికే వినియోగించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లపై ఉంది. నాణ్యత లేని రోడ్ల పేరుతో ప్రజాధనం వృథా కాకుండా ప్రభుత్వం కఠిన పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

## తాసిల్దార్ సుజాత రెడ్డి



**వాగులో ఇసుక డంపుల సీజ్** ఖానాపూర్ ఆగస్టు 12 (ప్రజా జ్యోతి ) ఖానాపూర్ పట్టణం రేంకొని వాగులో అక్రమ సరఫరాకు నిల్వ ఉంచిన డంపులను తాసిల్దార్ సుజాత రెడ్డి ఆదేశాల మేరకు సీజ్ చేశారు, ఫిర్యాదు మేరకు హైటెక్ సిటీ ప్రాంతంలోని వాగు లో గల ఇసుకను పట్టణ గిర్దవర్ నగేష్ జిపిఓ బత్తుల ప్రవీణ్ రెవెన్యూ సిబ్బంది దామెర నరసయ్య తదితరులు సందర్శించి తాసిల్దార్ కు సమాచారం అందించి సీజ్ చేశారు వాగుల్లో వంకల్లో ఇసుకను డంపుగా చేసి అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని తాసిల్దార్ సుజాత రెడ్డి హెచ్చరించారు.

## 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్తమ ఉద్యోగులు వీరే...

**కంపెనీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఎస్‌డీఎల్ ఆపరేటర్ సామాని సదానందం**




**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):** 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. సింగరేణి సంస్థలో ప్రతి ఏడాది స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కంపెనీ స్థాయి, ఏరియా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సత్కరించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ఏడాది శ్రీరాంపూర్ ఏరియా నుంచి కంపెనీ స్థాయి ఉత్తమ ఉద్యోగిగా ఆర్‌కే--7 ఇంక్లైన్‌కు చెందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ సామాని సదానందం ఎంపికయ్యారు. కొత్తగూడెంలో నిర్వహించే 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో సింగరేణి సీఎండీ చేతుల మీదుగా సామాని సదానందం సత్కారం అందుకోనున్నారు. శ్రీరాంపూర్ ఏరియా స్థాయిలో ఆర్‌కే--5 గని నుంచి కేసరి సమ్మయ్య (హాలర్ ఆపరేటర్), ఎండీ ఇబ్రహీం హుస్సేన్ (డీహెచ్), ఆర్‌కే--7 నుంచి బోయిన శంకర్ (అసిస్టెంట్ చెన్‌మెన్), గెల్లి కుమారస్వామి (ఎస్‌డీఎల్ ఆపరేటర్), ఆర్‌కే--ఎన్‌టీ నుంచి పిడుగు సత్యనారాయణ (మున్షీ), జాలపెల్లి వెంకటేశం (సపోర్ట్‌మెన్) ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. అదేవిధంగా ఎస్ఆర్‌పీ--1 నుంచి జిల్లాల తిరుపతి (సీనియర్ మైనింగ్ సర్దార్), ముత్తినేని రాజేంద్ర ప్రసాద్ (ఎలక్ట్రిషియన్), ఎస్ఆర్‌పీ--3 నుంచి కొలుగూరి పెర్మానందం (జనరల్ అసిస్టెంట్), ఎండీ అబ్దుల్ సత్తార్ (ఫిట్టర్), ఐకే--1ఏ ఇంక్లైన్ నుంచి కొంకటి తిరుపతి (సపోర్ట్‌మెన్), మహమ్మద్ యూసఫ్ (టెండాల్)ను కూడా ఏరియా స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. ఎస్ఆర్‌పీ ఓసీపీ నుంచి తెప్పాల మోహన్ రెడ్డి (ఈపీ ఆపరేటర్), నయనాల శ్రీనివాస్ (ఫిట్టర్), ఐకే ఓసీపీ నుంచి గంగుల రాజ్ కుమార్ (కన్వేయర్ ఆపరేటర్), కొత్తపల్లి పోచం (ఈపీ ఆపరేటర్), సీపీ నుంచి తోటం భాస్కర్ (సీనియర్ అసిస్టెంట్) ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సత్కరించనున్నారు. కంపెనీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన ఆర్‌కే--7 గని ఎస్‌డీఎల్ ఆపరేటర్ సామాని సదానందంతో పాటు ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగులకు ఆయా గనుల అధికారులు, ఏరియా అధికారులు, ఉద్యోగులు అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలి

కాంగ్రెస్ నాయకులు వొద్నాల శ్రీనివాస్



**రామకృష్ణాపూర్, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** క్యాతనపల్లి మునిసిపాలిటీలో రహదారుల గుంతలు, మురికి కాల్వలు, పారిశుధ్యం, దోమల బెడద, వీధి దీపాలు, పశువులు, కుక్కలు, కోతుల బెడద వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ అధ్యక్షులు వొద్నాల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.వర్షాకాలం నేపథ్యంలో ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురికి కాల్వల శుభ్రత వంటి చర్యలు చేపట్టాలని, రహదారుల గుంతలు పూడ్చి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యాసాగర్ రెడ్డి, పనాస రాజయ్య, గోపు రాజం, మేకల సురేందర్, కూనారపు శివ కుమార్, కొక్కుల సతీష్, దాముక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం చెన్నూరు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అనంతరం సందర్శించి న కలెక్టర్ పూర్తయిన భోజనశాలను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలను వినియోగంలోకి తీసుకురావాలని, అదనపు గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజనం తయారీలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థుల కు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన వంటశాల, మూత్రశాలలు, కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.





అభివృద్ధికి కృషి చేయాలి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ దండే విఠల్......బెజ్జూర్: మండలంలోని రైతు వేదికలో ఈరోజు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు గారు మాట్లాడుతూ బెజ్జూర్ సామాజిక ఆసుపత్రి నూతన భవన నిర్మాణం కోసం పెట్టిన ప్రతిపాదన తుది దశకు చేరిందని, ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాగానే పనులు మొదలు పెడదామని తెలిపారు. అలాగే సలుగుపల్లి వద్ద నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాల్సిందిగా తాసిల్దార్ గారిని ఆదేశించారు. అవసరమైతే సోమినిలో ఇంకో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా డాక్టర్లకు సూచిస్తూ నార్మల్ డెలివరీ కేసెస్ బెజ్జూరు సామాజిక ఆసుపత్రిలోనే నిర్వహించాలని ఆదేశించారు.బెజ్జూర్ సోమిని మధ్య రెండు వంతెనల నిర్మాణం కోసం అటవీ శాఖ మంత్రితో సమావేశం అవుతామని తెలిపారు. ఎక్కడా లోవోల్టేజ్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఒక్కో శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు.ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలన్నారు.గ్రామాలలో రోడ్ల నిర్మాణాలు.వ్యవసాయ సమస్యలను గురించి తెలుసుకున్నారు. కరెంట్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అభివృద్ధి మా ధ్యేయం అని అన్నారు.గ్రామాలలో అభివృద్ధికి పనులకు అటవిశాఖ అధికారులు అడ్డు పడుతున్నారని దీంతో నేల కోన్న పలు సమస్యల గురించి ఎమ్మేల్యే.ఎమ్మెల్సి దృష్టి కి సర్పంచ్ లు తీసుకోచ్చారు త్వరలోనే అధికారుల సమన్వయంతో పనులు పూర్తి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బండారి ప్రవీణ్, తాహసిల్దార్ రామ్మోహన్ రావు, స్పెషల్ ఆఫీసర్ నదీమ్ కుదుస్, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలి

డిసెంబర్ 17 వరకు గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్

దేశవ్యాప్తంగా 40 కోట్ల సంతకాల సేకరణకు పిలుపు





**మంచిర్యాల, 12,ఆగస్టు (ప్రజాజ్యోతి):** గోహత్యను పూర్తిగా నిర్మూలించాలని, గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ చేపట్టిన గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్‌లో భాగంగా మూడో దఫా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని డిసెంబర్ 17 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల లోని గర్మిళ్ల సరస్వతి శిశుమందిర్‌లో జిల్లా ప్రభారీ వేముల హరిప్రసాద్ అధ్యక్షతన ఈ అంశంపై బుధవారం సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని సతీష్ మాట్లాడుతూ సనాతన ధర్మంలో సకల దేవతలకు నిలయంగా భావించే గోమాతను అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగానే మూడో దఫా సంతకాల సేకరణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 40 కోట్ల సంతకాలు సేకరించి, గోమాతను జాతీయ మాతగా ప్రకటించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమయంలో గోమాత కోసం పోరాడకపోతే భవిష్యత్తులో గో హత్యను అడ్డుకోవడం మరింత కష్టమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యమంలో పాల్గొని గోమాత కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోనె శ్యామ్ సుందర్‌రావు, దొంతుల ముకేశ్, కర్ణకంటి రవీందర్, పురుషోత్తం జాజ్, వీహెచ్‌పీ కార్యదర్శి వేముల రమేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు కనకతార, రామగిరి శ్రీనివాస్, అమిత్ కృష్ణ, మణికంఠ, తోట కార్తీక్, ఉదేయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ పట్టణంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ

పట్టణం అంతా త్రివర్ణ పతాకమయం పాల్గొన్న పాఠశాలల విద్యార్థులు

మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక ఎంఈఓ సంధ్యారాణి



**ఖానాపూర్ ఆగస్టు 12( ప్రజా జ్యోతి )**రాబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా, దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ నేతృత్వంలో హర్ ఘర్ తీరంగా భారీ ర్యాలీ బుధవారం నిర్వహించారు ఈ ర్యాలీని ఖానాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక మహేందర్, ఎంఈవో సంధ్య రాణి లు ప్రారంభించారు. రాణి స్థానిక గర్ల్స్ హై స్కూల్ మీదుగా ఎన్టీఆర్ చౌక్ జగన్నాథ్ మీదుగా జరిగింది ఈ సందర్భంగా రితేష్ రాథోడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యతను చాటుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేయాలని పిలుపు నిచ్చారు. మన దేశ భక్తిని చాటేలా హర్ ఘర్ తీరంగా కార్యక్రమాన్ని యువత ముందుకు తీసుకెళ్లి ప్రతి ఇంటి పై త్రివర్ణ పథకాన్ని ఎగరవేసేలా ప్రజలను చైతన్య పరచాలని విజ్ఞప్తి చేయాలి. పార్టీలకతీ తంగా అందరూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని మన దేశ భక్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్ జిల్లా కార్యదర్శి అదిరి శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ కుమార్ మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్ కౌన్సిలర్లు గుమ్ముల అశోక్ నాయకులు ప్రకాష్ కొండవీటి రమేష్ సందీప్ పడాల రాజశేఖర్ దాని పెల్లి సుధాకర్ బత్తుల నారాయణ దాసరి శ్రీనివాస్ కొండ సురేష్ నడిమెట్ల కిషన్ పంబాల ప్రశాంత్ తో పాటు పలువురు పాల్గొన్నారు

# మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యలు పరిష్కరించి ఉద్యోగాలు కల్పించాలి



సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట బాధితుల నిరవధిక దీక్ష



**మంచిర్యాల, 12,ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బాధితులు నిరవధిక నిరసన దీక్షకు దిగారు. బుధవారం నుంచి కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట ప్రారంభమైన ఈ దీక్షకు సింగరేణి వ్యాప్తంగా పదకొండు ఏరియా కోల్‌బెల్ట్ ప్రాంతాలకు చెందిన బాధితులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసనలో పాల్గొన్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమ కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు తల్లిదండ్రులు వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ తమ పిల్లలకు న్యాయం జరుగుతుందనే ఆశతో దీక్షలో పాల్గొంటున్నారని తెలిపారు. ఉద్యోగాలు కల్పించే వరకు దీక్ష విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే పలుమార్లు కమిటీలు వేస్తామని హామీలు ఇస్తూ సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులు ఆరోపించారు. ఇకపై కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు జారీ చేసి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యాన్ని బాధితుల సంఘం అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నిరవధిక నిరసన దీక్షలో లక్కా శ్రావణ్ గౌడ్, అంబటి రాజశేఖర్, భాగ్యలక్ష్మి, కొమరమ్మ, హరిష్ యాదవ్, ఓం ప్రకాష్, తోట్ల విజయ్, సాయికిరణ్, రామెండ్ల సందీప్ పిట్టల అనిల్ కుమార్, చింత పెంటయ్య, పాయం సూరయ్య, సదానందం, సైదిలు, అజ్మీరా నరేష్, అడ్డంకి రంజిత్, సక్రూ, అశోక్ అన్వేష్, డీజ్ బాబూ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్కా శ్రావణ్ గౌడ్ మాట్లాడుతూ తమ సమస్యను ఇకపై నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ నియామకాలపై స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు తమ నిరసన కొనసాగుతుందని సింగరేణి మారుపేర్లు అండ్ విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితుల సంఘం అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ స్పష్టం చేశారు.

# పుస్తక పఠనంతోనే సమాజంలో ఉన్నత స్థానాలు సాధ్యం





జిల్లా కలెక్టర్ రాజర్షి షా

జందాపూర్ గ్రామంలో నూతన గ్రంథాలయం ప్రారంభం

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 12, (ప్రజా జ్యోతి )** పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకున్న వారే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని, గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలేక్టర్ మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు, విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహద పడటంతో పాటు సమాజంలో సానుకూల మార్పులకు దారి తీస్తుందని పేర్కొన్నారు.చదువు ప్రతి ఒక్కరి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంత మైన సాధనమని, యువత తమ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని విధాలుగా సహకరి స్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ తరహాలోనే ఇతర ప్రాంతాల్లో కూడా త్వరలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించా రు.గ్రామ అభివృద్ధికి అవ సరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారి స్తున్నామని కలెక్టర్ తెలిపారు. జందాపూర్ గ్రామంలో రహదారి సమస్యను ఆర్ అండ్ బీఅధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని, గ్రామానికి నూతన అంగన్వాడీ భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.పరిశుభ్రత ప్రతి గ్రామ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, గ్రామ సర్పంచ్ బత్తుల గంగమ్మ, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, తహసీల్దార్ గోవింద్, డీఎల్పీఓ ఫణిధర్, ఎంపీడీఓ కృష్ణవంశీ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, గ్రామస్థు లు తదితరులు పాల్గొన్నారు.

## నాగదేవత కాలనీ, సూర్యనగర్‌లో సీసీ డ్రైన్ పనులకు శ్రీకారం



**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్ దూస శంకరయ్య నాగదేవత కాలనీ, సూర్యనగర్ కాలనీ రోడ్ నంబర్--6లో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సహకారంతో టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నారు. ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్ పనులను ప్రారంభించారు. డ్రైన్ నిర్మాణంతో వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, మురుగు నీటి సమస్యలు తొలగి ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కార్పొరేటర్ తెలిపారు. డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజలు అందిస్తున్న సహకారానికి మంచిర్యాల కార్పొరేషన్ 39వ డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిజియోథెరపీ క్లినిక్‌ల వివరాలు నమోదు చేసుకోవాలి

**రిజిస్ట్రేషన్ లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు**

**డీఎంహెచ్ఓ డాక్టర్ నరేంద్ర రాథోడ్**



**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):** జిల్లాలో పనిచేస్తున్న ప్రైవేట్ ఫిజియోథెరపిస్టులు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ప్రత్యేక ఫిజియోథెరపీ క్లినిక్‌ల నిర్వాహకులు తమ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్ సూచించారు. ఎలాంటి రిజిస్ట్రేషన్, అనుమతులు లేకుం డా ఆసుపత్రులు, ఫిజియోథెరపీ క్లినిక్‌లు నిర్వహిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వైద్య కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ ఎక్కిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ ఫిజియోథెరపిస్టులు డీఎంహెచ్ఓ డాక్టర్ నరేంద్ర రాథోడ్‌ను బుధవారం కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ప్రత్యేక ఫిజియోథెరపీ క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్టులు తమ పూర్తి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫిజియోథెరపీ సేవలు నిబంధ నలకు అనుగుణంగా నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత నిర్వాహకులపై ఉందన్నారు. జిల్లాలోని అన్ని ఫిజియోథెరపీ క్లినిక్‌లను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సందర్శించి తనిఖీలు నిర్వహిస్తారని, రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర అంశాలను పరిశీలించి నిబంధనలు ఉల్లం ఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ నరేంద్ర రాథోడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఫిజియోథెరపిస్టులు సురేందర్, అజయ్, శ్యాంసుందర్, తేజస్విని, ఓదెలు, అనిల్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక



**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):** బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మంచిర్యాల జిల్లా నూతన కమిటీని సబ్బండ కులాలతో కలిపి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజు, రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ సమక్షంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులుగా మంచర్ల సదానందం, ఉపాధ్యక్షులుగా బొప్ప పరశురామ్, గడ్డం మానస గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాములు, కార్యదర్శిగా గడ్డం కోమలి, సంయుక్త కార్యదర్శులుగా మేడిరాజు, భుక్య కిరణ్ నాయక్, కోశాధికారిగా మోరే ప్రభాకర్, మీడియా కార్యదర్శిగా ఇప్ప సురేష్ ఎన్నికయ్యారు. సలహా సభ్యులుగా బండారి సంజీవ్ కుమార్, పడాల రామన్న, ఎదునూరి రమేష్, లాట్ రవి, జంగేపల్లి రామస్వామి, నగునూరి సారయ్య, దయ్యాల అశోక్ కుమార్ ముదిరాజ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీని మంచిర్యాల జిల్లాలోని గ్రామగ్రామాన విస్తరించి, అన్ని వర్గాలను ఐక్యం చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

## పరిశుద్ధ పనులు సక్రమంగా నిర్వహించాలి సర్పంచ్



**కేరమేరి ఆగష్టు 12 ప్రజా జ్యోతి** గ్రామంలో పరిశుద్ధ పనులను సక్రమంగా నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అగర్వాడ సర్పంచ్ రోజా సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం గ్రామంలోని వీధులను శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామ పారిశుద్ధ్యానికి సహకరించాలని ఆమె కోరారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన వాతావరణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# ఎల్ నినో ప్రభావం పై అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**తాగునీటికే తొలి ప్రాధాన్య త**

**ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి**

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 12, (ప్రజా జ్యోతి )** మారుతున్న వాతావరణ ప రిస్థితులు, 'ఎల్ నినో' ప్రభా వంతో తలెత్తే సవాళ్లను స మర్థవంతంగా ఎదుర్కొనేం దుకు జిల్లా యంత్రాంగం, రైతాంగం సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రస్తుత నీటి లభ్య త, ప్రాజెక్టులలోని నీటి ని ల్వాలు, వర్షాభావ పరిస్థితు లను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారుల ను ఆదేశించారు. నీటి వనరులను శాస్త్రీయంగా విని యోగిస్తూ తాగునీరు, సాగు నీటి అవసరాలను సమతుల్యంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను సమీక్షించిన కలెక్టర్, తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, అనంతరం సాగునీటి పంపిణీని సమర్థవంతంగా నిర్వ హించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల్లోని నీటి లభ్యతను బట్టి పంటల సాగు ప్రణాళిక రూపొం దించాలని, ప్రతి రైతుకు సమానంగా నీరు అందేలా చివరి ఆయకట్టు వరకు సాగు నీటి సరఫరా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో నిరంతరం అనుసంధానమై పనిచేయాలని, తక్కువ నీటితో అధిక దిగుబడి నిచ్చే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి



ప్రోత్సహించాలని ఆదేశించారు.డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా వినియోగించే లారైతులను ప్రోత్సహించాలని, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలని సూచించారు. వర్షాభావ పరిస్థి తులను సమర్థంగా ఎదుర్కొ నేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని, ఆరుతడి, ప్రత్యామ్నా య పంటల సాగుకు ప్రాధా న్యత ఇవ్వాలని కలెక్టర్ కోరారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియో గిస్తూ ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ జగదీష్, సూపరింటెం డింగ్ ఇంజనీర్ ప్రభు కల్యా ణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీల్, సంబంధిత శాఖల అధికారులు, రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల తర్వాత డ్రైనేజీలకు విముక్తి.

**కలెక్టర్ ఆదేశాలతో కదిలిన ఎన్‌హెచ్ఏఐ అధికారులు.**

**సోన్, ఆగష్టు 12(ప్రజా జ్యోతి):** మండల కేంద్రం లోని కడ్తాల్ గ్రామంలో ఏళ్ల తరబడి పట్టించుకోని డ్రైనేజీలకు ఎట్టకేలకు విముక్తి లభించింది. నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాలతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు కదిలారు. సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో జాతీయ రహదారి -44కు ఇరువైపులా ఉన్న డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు గత వారం రోజులుగా యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతు న్నాయి. హైదరాబాద్ - నాగ్‌పూర్ మధ్య జాతీయ రహదారి -44ను నాలుగు లైన్లుగా విస్తరించిన సమయంలో కడ్తాల్ గ్రామంలో రహదారికి ఇరువైపులా డ్రైనేజీలను నిర్మించారు. అయితే రహదారి విస్తరణ తర్వాత ఇప్పటివరకు డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఏళ్లుగా చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో వర్షాకాలంలో మురుగునీరు స్తంభించి ఇళ్లలోకి చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. ఇటీవల గ్రామంలో నూతన పాలకవర్గం ఏర్పడిన అనంతరం సర్పంచ్ గుర్రం రాము ఆధ్వర్యంలో గ్రామస్తులు జూలై 27న నిర్వహించిన ప్రజావాణిలో డ్రైనేజీ సమస్యను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన కలెక్టర్ వెంటనే స్పందించడంతో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సంబంధిత ఎన్‌హెచ్ఏఐ అధికారులతో



మాట్లాడి డ్రైనేజీలను తక్షణమే శుభ్రం చేయాలని ఆదేశించారు. జిల్లా అధికారుల ఆదేశాలతో ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది రంగంలోకి దిగి డ్రైనేజీల్లోని పూడిక, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యకు నూతన పాలకవర్గం చొరవతో పరిష్కారం లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలను ఇకపై క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు వర్షాకాలంలో మురుగునీరు ఇళ్లలోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పోలీస్ వాహనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):**పోలీస్ వాహనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా, మంచి స్థితిలో నిర్వహిస్తూ ప్రజలకు అందించే పోలీస్ సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణను సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల స్థితిగతులు, నిర్వహణ, సమాచార ప్రసార పరికరాల పనితీరును ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలీస్ వాహనాలు నిరంతరం అందుబాటులో ఉండేలా వాటిని సక్రమంగా నిర్వహించాలని సీపీ సూచించారు. ప్రతి పోలీస్ వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర దీపం, తాళ్లు, ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే రక్షణ సామగ్రిలో భాగంగా హెల్మెట్, రాళ్ల దాడుల నుంచి రక్షణ కవచం, లాఠీ, శరీర రక్షణ కవచం, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వాహనాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి సరిదిద్దాలని సీపీ తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, దాని పనితీరు, నిర్వహణకు సంబంధించిన సమగ్ర నివేదికను ప్రతి నెలా సమర్పించాలని మోటారు వాహనాల అధికారులను ఆదేశించారు. పోలీస్ వాహనాలను డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని, అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సొంత వాహనాల మాదిరిగా జాగ్రత్తగా చూసుకోవాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. నిర్ణీత వ్యవధిలో వాహనాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ఇంజిన్ నూనె మార్పు, టైర్ల నిర్వహణ తదితర అంశాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వాహనాల పనితీరుపై డ్రైవర్లకు పూర్తి అవగాహన కల్పించి, అత్యవసర సమయాల్లో వాహనాలను సమర్థవంతంగా వినియోగించేలా వారికి శిక్షణ ఇవ్వాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

# సింగరేణి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి



సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తుమ్మల రాజారెడ్డి

**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా సంస్థకు వచ్చిన లాభాలను యాజమాన్యం ఇప్పటివరకు ప్రకటించకపోవడం సరికాదన్నారు. వెంటనే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను ప్రకటించడంతోపాటు సంస్థ ఆర్థిక పరిస్థితిపై సమగ్ర శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కోరారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో సంస్థ అభివృద్ధి కోసం దాదాపు రూ.6 వేల కోట్లను పక్కన పెట్టిన యాజమాన్యం.. ఆ నిధులతో సంస్థలో ఎంత మేర అభివృద్ధి పనులు చేపట్టిందో కార్మికులకు వివరించాలని తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. సంస్థ ఆర్థిక పరిస్థితిపై కార్మికులకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. మరోవైపు కార్మికులు విధులు నిర్వహించేందుకు అవసరమైన పనిముట్లు, రక్షణ పరికరాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన బూట్లు, బిట్లు, డ్రిల్ రాడ్లు, హాలేజ్ రోప్‌లు, వానకోట్లు, సెక్యూరిటీ సిబ్బందికి యూనిఫాంలు, బూట్లు తదితర రక్షణ పరికరాలను వెంటనే కొనుగోలు చేసి కార్మికులకు అందించాలని కోరారు. అవసరమైన పరికరాలను సకాలంలో కొనుగోలు చేసి అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల కార్మికుల వేతనాల నుంచి సీఎంపీఎఫ్ కోసం డబ్బులు రికవరీ చేస్తున్నప్పటికీ, ఆ మొత్తాలు కార్మికుల ఖాతాల్లో సకాలంలో అప్‌డేట్ కాకపోవడం సీఎంపీఎఫ్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దీనిపై సింగరేణి యాజమాన్యం బాధ్యత తీసుకుని కార్మికుల సీఎంపీఎఫ్ ఖాతాల వివరాలను వెంటనే అప్‌డేట్ చేయించి, వారికి చిట్టీలు అందించాలని తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి అని రాజేందర్‌తో పాటు బ్రాంచ్ నాయకులు వెంగల శ్రీనివాస్, సాయిళ్ల శ్రీనివాస్, తోడే సుధాకర్, మీడివెల్లి శ్రీనివాస్, వెంకటరెడ్డి, పేరుక సదానందం, సిరికొండ శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## 6 వార్డులో దోమల నివారణకు పాగింగ్ పిచికారి

మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ సోయబ్ హుస్సేన్



**ఖానాపూర్ ఆగస్టు 12( ప్రజా జ్యోతి )** పట్టణంలో విచ్చలవిడిగా దోమల వల్ల అనరారోగ్యాలు సోఖకుండా ముందస్తుగా మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సోయాబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఖానాపూర్ 6వ వార్డు పరిధిలో బుధవారం సాయంత్రం దోమల నివారణకు పిచికారి ఫాగింగ్ మిషనరీ తో పొగను వాడల్లో విస్తరింపజేశారు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేకంగా దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆస్పత్రి వెనకాల పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా మస్కిటో ఫాగింగ్ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోయాబ్. మాట్లాడుతూ... పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం దృష్టి సారిస్తున్నామని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా మున్సిపాలిటీ తరఫున అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సయ్యద్ మెయిన్, సజ్జద్ అలీ, అబ్దుల్ జలీల్ మున్సిపల్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తరచు సిబ్బందిని సంబంధిత ప్రజలను ఇబ్బంది పెడుతున్న విద్యుత్ పోల్ పై బ్యానర్ను తొలగించండి



**ఖానాపూర్ ఆగస్టు 12 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలోని నడిబోడ్డులోని స్థానిక డిఎస్ మార్ట్ వద్ద విద్యుత్ స్తంభం పై గత నెల రోజులుగా బ్యానర్ తట్టుకొని తరచూ విద్యుత్ సిబ్బందికి పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తుంది వర్షం పడిన గాలులు విచిన వైర్లపై గల బ్యానర్ బట్ట తరచు తీగలపై అంటుకొని త్రీఫేస్ ట్రాన్స్ఫర్ ఎగిరిపోవడంతో ఈ పరిసర ప్రాంతంలో విద్యుత్తుకు అంతరాయం కలుగుతుంది అయితే విద్యుత్ సిబ్బంది పలుమార్లు వచ్చి సమస్యను పరిష్కరించిన శాశ్వత పరిష్కారానికి బ్యానర్లు తొలగించాల్సింది మర్చిపోతున్నారని ఆ వీధి ప్రజలు ఆరోపిస్తున్నారు అర్ధరాత్రిలు ఈదురుగాలులతో వర్షం పడితే ట్రాన్సారం లో బ్యానర్ బట్ట నీళ్లు సోకి విద్యుత్ తొలగిపోతే చీకటి మాయం అవుతుందని ఆ సమయంలో సిబ్బంది కూడా వచ్చి చేసేదేమి ఉండదు కాబట్టి వెంటనే డి ఎస్ మార్ట్ వద్ద గల స్థంభంపై ఉన్న బ్యానర్ ను తొలగించాలని వీధి ప్రజలు విద్యుత్ అధికారులను కోరుతున్నారు

## రెండవ సారి ఏకగ్రీవంగా బాసర మండల అధ్యక్షుడు గా ఎన్నికైన మమ్మాయి శ్రీనివాస్

బాసర మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక.
రెండవ సారి ఏకగ్రీవంగా బాసర మండల అధ్యక్షుడు గా ఎన్నికైన మమ్మాయి శ్రీనివాస్




**బాసర ఆగస్టు 12 (ప్రజాజ్యోతి)** బాసర మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్లో సంఘ కార్యవర్గాల జిల్లా కమిటీ ఆదేశాల మేరకు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికలు జరిగాయి. మండల అధ్యక్షులుగా మమ్మాయి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా ఖాసిం, లావణ్య, కోశాధి కారిగా గంగాధర్ జాయింట్ కార్యదర్శిగా శ్రీధర్ గౌడ్ శైలజ ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి, సంఘ బలోపేతానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు మమ్మా యి శ్రీనివాస్ తెలిపారు నూతనంగా ఎన్నికైన వారికి మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు...

## 23 మంది నీట్ విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు

ఎంఎస్ నీట్ అకాడమీ వి ద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ అభినందనలు



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 12, (ప్రజా జ్యోతి )** రీ-నీట్--2026 ఫలితాల్లో ఆదిలాబాద్‌కు చెందిన ఎంఎస్ నీట్ అకాడమీ విద్యా ర్థులు విశేష ప్రతిభ కనబరిచి 23 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ స మావేశ మంది రంలో బుధవారం నిర్వహించిన కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా విజేతలను ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అకాడ మీ యాజమాన్యాన్ని అభినందించారు. వైద్య వి ద్యలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు తమ విజయా నికి దోహదపడిన అంశాలను కలెక్టర్‌తో పంచుకు న్నారు. అకాడ మీ విద్యార్థుల్లో సాదియా సనోబర్ 517 మార్కులతో ఆల్ ఇండి యా ర్యాంక్ 68,909 సాధించి ప్ర థమ స్థానంలో నిలిచారు. అన్హరాహ్ ఫాతిమా 505 మార్కులతో 80,204వ ర్యాంక్, ఉరూ బా మహేవిష్ 485 మార్కులతో 1,10,13 6వ ర్యాంక్, అలీజా నాజ్ 477 మార్కులతో 1,22,03 3 వ ర్యాంక్ సాధించారు. అలాగే మొహమ్మద్ షకీబ్ (461), ఫైజా మహేవిష్ (457), జోహా అన్వర్ ఖానమ్ (456), సుమయ్య ఫాతిమా (451), అలీనా మహేవిష్ (446), లుక్మాన్ అహ్మద్ (446) తదితరులు కూడా ఉత్తమ మార్కులతో ఎంబీ బీఎస్ సీట్లు దక్కించుకున్నా రు. విజేత లకు కలెక్టర్ జ్ఞాపి కలు, అభినందన పత్రాలు అందజేసి సత్కరిం చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ రో హిత్, స్థానిక నాయకులు సాజిద్ ఖాన్, యూనుస్ అక్బానీ, సయ్యద్ సాజిదుద్దీ న్, ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం సీపీ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా కమిషనరేట్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలను ఆయన సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాత కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కేసుకు సంబంధించిన దర్యాప్తు పురోగతి, ఇతర వివరాలను సీసీటీఎన్ఎస్ 2.0లో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, దర్యాప్తు అధికారులు సకాలంలో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీపీ సూచించారు. నిందితుల అరెస్టుల్లో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. తీవ్రమైన నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరాల పెరుగుదలకు సంబంధించిన కేసులు, కీలక నివేదికల పెండింగ్ అంశాలను డీసీపీలు, ఏసీపీలు తమ పరిధిలో క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-సమన్లను కూడా త్వరితగతిన పరిష్కరించి, వాటి పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఆస్తి సంబంధిత కేసులు, చిట్‌ఫండ్, ఆర్థిక నేరాలు, సీఎంఆర్ బియ్యం అక్రమ మళ్లింపు కేసుల్లో ఆన్‌లైన్ వివరాల నమోదు, నిందితుల అరెస్టులు తదితర అంశాలను సీపీ సమీక్షించారు. ఆర్థిక నేరాల్లో ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, జప్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. నిబంధనల ప్రకారం ఆస్తుల జప్తు ప్రక్రియను తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. కొత్త నేర న్యాయ చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీపీ సూచించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ కేసుల దర్యాప్తుకు అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, సమాచార సాంకేతికతకు సంబంధించిన కేసులను నిర్దేశిత ప్రామాణిక విధానాల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని తెలిపారు.జీఆర్ఎం, ఎంఆర్ఎం పనితీరును మెరుగుపరుచుకోవాలని, సమన్వయ పోర్టల్‌పై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరై తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పేకాట, ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ తరలింపు తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని సీపీ ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ ప్రజలకు అందుబాటులో ఉండటం తమ ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని సీపీ తెలిపారు. సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని, నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వారికి పోలీసులపై నమ్మకం, భరోసా కలిగేలా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీసుల ప్రవర్తనే పోలీస్ శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుంది అని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యానికి ఎలాంటి తావివ్వకూడదన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ సి. హెచ్. శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌తో పాటు ఇతర సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## మహిళా జనరల్ అసిస్టెంట్ల నుంచి సెక్యూరిటీ గార్డు విధులకు దరఖాస్తుల ఆహ్వానం

### శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు అవకాశం

**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్ / జనరల్ అసిస్టెంట్ ట్రైనీ (మహిళలు) నుంచి ఎస్అండ్‌పీసీ విభాగంలో సెక్యూరిటీ గార్డు విధులు నిర్వహించేందుకు ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని జీఎం కార్యాలయం, క్యూ.ఎం. బీపీఏ రీజియన్, సివిల్ బీపీఏ రీజియన్, జీవీటీసీ శ్రీరాంపూర్, ఐఏ శ్రీరాంపూర్, డిస్పె ఆర్కే-8 తదితర విభాగాల్లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్ / జనరల్ అసిస్టెంట్ ట్రైనీ మహిళా ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు సంబంధిత అధికారి ద్వారా రాతపూర్వక దరఖాస్తులను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌కు 20, ఆగస్టు, 2026 లోగా సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులు అందకపోతే కంపెనీ నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ చేపడతామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ స్పష్టం చేశారు.

ONE FAMILY. ONE VISION. ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL

## దత్త సాయి ఆశ్రమ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి



**సారంగాపూర్,ఆగస్టు 12:ప్రజా జ్యోతి** ప్యారామూరు గ్రామంలోని శ్రీ దత్త సాయి ఆశ్రమానికి కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆశ్రమ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారికి వినతిపత్రం అందజేశారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ సమీపంలోని మారుతి ఇన్ హోటల్‌లో ఆశ్రమ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మిర్ద సాయన్న కలిసి కేంద్ర మాజీ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్యారామూరు గ్రామంలోని దత్త సాయి ఆశ్రమానికి కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు మిగతా అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. వినతిపై స్పందించిన డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి దత్త సాయి ఆశ్రమానికి నిధులు మంజూరు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యారామూరు గ్రామ ఆలయ కమిటీ సభ్యులు భోజారెడ్డి, రామకృష్ణ,సాక్‌పెల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో క్రీడా పోటీలు





**అదిలాబాద్ టౌన్, ఆగస్టు 12 ( ప్రజా జ్యోతి )**తలమడుగు మండలం ఝరి పునగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ పోటీలలో పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ ఆటల పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, పోటీ తత్వంతో పాల్గొన్నారు. గెలుపోటములను పక్కన పెట్టి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. ముఖ్య అతిథులు,పర్యవేక్షణగా క్రీడా పోటీలను పాఠశాల ఇంచార్జ్ హెడ్ మాస్టర్ సాంబన్న మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు రాథోడ్ శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహిస్తూ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అయిన భోజరెడ్డి, పోతన, ధరమ్ సింగ్, గంగయ్య మరియు వార్డెన్ రాము పాల్గొని విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను చూసుకున్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15 వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

# కట్టతో కష్టం.. నీట మునిగిన పత్తి!

పక్క పొలానికి కట్టతో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకి

రోజుల తరబడి పొలంలోనే నీరు.. పంట దెబ్బతింటున్నదని రైతు ఆవేదన

సర్పంచ్, పోలీసులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపణ

క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి



**ఆసిఫాబాద్ ఆగస్టు 12 ప్రజా జ్యోతి** వర్షాకాలం వచ్చిందంటే రైతులు పంటలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. అయితే పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడం ఇప్పుడు రైతులకు కొత్త కష్టాలను తెచ్చిపెడుతోంది. వాంకిడి మండల కేంద్రం శివారులో పత్తి సాగు చేసిన రైతు ఇటన్కార్ బాపురావు ఇదే సమస్యతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క పొలానికి వేసిన కట్ట కారణంగా వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక తన పొలంలోనే నిలిచిపోతోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తన పొలంలో భారీగా నీరు చేరుతోందని బాపురావు తెలిపారు. నీరు బయటకు వెళ్లే సహజ మార్గం లేక రోజుల తరబడి పొలంలోనే నిలిచిపోవడంతో పత్తి మొక్కలు బలహీనపడుతున్నాయని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే పంట దిగుబడి తగ్గడంతో పాటు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### పెట్టుబడి నీటిపాలు?

పత్తి సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, దున్నకం కూలీలకు ఇప్పటికే భారీగా ఖర్చు చేశానని బాపురావు తెలిపారు. పంట చేతికొచ్చి అప్పులు తీర్చుకోవాలని ఆశించగా, నీరు నిలిచి పోవడంతో పెట్టిన పెట్టుబడే నీటిపాలు అయ్యే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

### పలుమార్లు వేడుకున్నా..

తన పొలంలోకి వస్తున్న వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం కల్పించాలని పక్క పొలం రైతును పలుమార్లు కోరినట్లు బాపురావు తెలిపారు. సమస్యను గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని ఆరోపించారు. దీంతో వాంకిడి పోలీసులను ఆశ్రయించి సమస్యను వివరించినా ఇప్పటివరకు పరిస్థితిలో మార్పు లేదని పేర్కొన్నారు.

### అధికారులు స్పందించాలి

పొలాల వద్దకు సంబంధిత అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలని బాపురావు కోరుతున్నారు. ఇరు వర్గాల రైతులతో మాట్లాడి వర్షపు నీరు సహజంగా వెళ్లే మార్గాన్ని గుర్తించి సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. పంట పూర్తిగా దెబ్బతిన్న తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే స్పందించి పంటను కాపాడాలని కోరారు. "ఎవరితోనూ గొడవ పడాలని లేదు. నా పంటను కాపాడుకోవడమే నా ఉద్దేశం. అధికారులు ఒక్కసారి పొలాన్ని పరిశీలించి నీరు వెళ్లే మార్గం చూపాలి" అని బాపురావు కోరారు.

# చేపల పెంపకంతో మహిళలకు అదనపు ఆదాయం




## – జిల్లాధికారి కె. హరిత

**ఆసిఫాబాద్ ఆగస్టు 12 ప్రజా జ్యోతి** స్వయం సహాయక సంఘాల మహిళలు చేపల పెంపకం, పాడి పరిశ్రమల నిర్వహణ ద్వారా ఆర్థికంగా బలపడి అదనపు ఆదాయం పొందాలని కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని జాముల్‌ధార గ్రామంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'ప్రధానమంత్రి కృషి సించాయి యోజన' వాటర్‌షెడ్ అభివృద్ధి విభాగం కింద నిర్మించిన పంట కుంటలు, ఊట కుంటల్లో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌లతో కలిసి కలెక్టర్ పాల్గొని ఊట కుంటల్లో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో భూగర్భ నీటిమట్టాన్ని పెంచేందుకు ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టాలని సూచించారు. వి బి జి రామ్ జి పథకం ద్వారా ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. కుంటలలో నీటిని నిల్వ చేయడం వల్ల భూగర్భ నీటిమట్టం పెరగడమే కాకుండా, మహిళా సంఘాలు చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొంది స్వయం సమృద్ధి సాధించవచ్చని తెలిపారు. నీటి సంరక్షణ పనుల ద్వారా అర్హులైన ?లీలకు ఉపాధి దినాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక చర్యలు చేపడుతోందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్క మహిళ స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, స్థానిక సర్పంచ్‌లు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్ చేయూత

లింగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం




**కడెం, ఆగస్టు 12(ప్రజా జ్యోతి)** మండలంలోని లింగాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ కుమ్మరి రంజిత్ కుమార్, ఉప సర్పంచ్ కమ్మల లక్ష్మీ స్వామి ఆధ్వర్యంలో ఖానా పూర్ న్యూ సింధు శ్రీ హాస్పి టల్ వారి సహకారంతో బు ధవారం ఉదయం 9 గంట ల నుండి 12 గంటల వరకు స్థానిక గ్రామపంచాయతీ కా ర్యాలయం లో ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని లింగాపూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి రంజిత్ ప్రారంభిం చారు. శిబిరంలో ఖానాపూర్ న్యూ సింధు శ్రీ హాస్పిటల్ డాక్టర్ ఇమ్రాన్ పాషా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ న్యూ సింధు శ్రీ హాస్పిటల్ ఎండి కొప్పుల లక్ష్మణ్, లింగాపూర్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ కమ్మల లక్ష్మీ స్వామి, వార్డ్ మెంబర్స్,వీడీసీ అధ్యక్షు లు బొంగు వెంకగౌడ్, గ్రామ ప్రజలు లింగాపూర్ గ్రామ పరి సర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామీణ యువత ఉన్నతికి గ్రంథాలయాలే వారధులు

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

కొల్హారి గ్రామంలో నూతన గ్రంథాలయం ప్రారంభం



**గుడి హత్నూర్, ఆగష్టు 12,( ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రాం తాల విద్యార్థు లు, యువత ఉన్నత లక్ష్యా లను సాధించడంలో గ్రంథా లయాలు కీలక పాత్ర పోషి స్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని కొల్హారి గ్రా మంలో నూతనంగా ఏర్పా టు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ప్రారం భించారు. రిబ్బన్ కట్ చేసి గ్రంథాలయాన్ని ప్రారంభించి న అనంతరం అక్కడ ఏర్పా టు చేసిన పుస్తకాలు, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్, దినపత్రికలు, ఇతర సౌక ర్యాలను పరిశీలించారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లా డుతూ, సాంకేతిక పరిజ్ఞా నం ఎంత అభివృద్ధి చెంది నప్పటికీ పుస్తక పఠనానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. పుస్తకాలు విజ్ఞానాన్ని పెం పొందించడమే కాకుండా ఆ లోచనా శక్తిని, వ్యక్తిత్వ వికా సాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాం తాల విద్యార్థులు, ఉద్యోగా ర్థులు పోటీ పరీక్షల పుస్తకాల కోసం పట్టణాలకు వెళ్లా ల్సిన అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే అన్ని సౌక ర్యాలు కల్పించడమే ఈ గ్రంథాలయ లక్ష్యమని తెలిపారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసర మైన గైడ్లు, రిఫరెన్స్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచినట్లు చె ప్పారు. యువత ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాల యాన్ని సద్వినియోగం చేసుకో వాలని, క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబంతో పాటు గ్రామా నికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, జిల్లా పంచా యతీ అధికారి రమేష్, గ్రం థాలయ సంస్థ కార్యదర్శి సు రేష్, స్థానిక ప్రజాప్రతినిధు లు, మండల అధికారులు, గ్రామ సర్పంచ్, కార్యదర్శి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వాగు దాటాల్సిందే.. డోలి మోయాల్సిందే!

### గర్భిణికీ తప్పని డోలి కష్టాలు
### అభివృద్ధి మాటలు సరే.. డోలి కష్టాలు ఎప్పటికి?
### వాగు దాటితేనే వైద్యం.. గిరిజనుల గోడు వినేదెవరు?
### రోడ్డు లేదు.. వంతెన లేదు.. డోలీయే దిక్కు!



**ఆసిఫాబాద్ ఆగష్టు 12 ప్రజా జ్యోతి** మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజలకు కనీస రహదారి, రవాణా సౌకర్యాలు అందకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో డోలి కష్టాలు తప్పడం లేదు. తాజాగా ఏడు నెలల గర్భిణిని కుటుంబ సభ్యులు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటించి ఆసుపత్రికి తరలించిన ఘటన కెరమెరి మండలంలో చోటుచేసుకుంది. అభివృద్ధి జరుగుతోందని ప్రభుత్వాలు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం గిరిజన గ్రామాల ప్రజలకు అత్యవసర వైద్యం కోసం వాగులు, వంకలు దాటాల్సిన దుస్థితి కొనసాగుతోంది.కెరమెరి మండలం తుమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొలంగూడ గ్రామానికి చెందిన కోడప రామేశ్వరి, భర్త భీమ్రావు, ఏడు నెలల గర్భవతి. బుధవారం ఆమెకు ఒక్కసారిగా కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గ్రామం నుంచి ఆసుపత్రికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో.. ఆమెను కుటుంబ సభ్యులు ఎత్తుకొని గొరియాగూడ వాగు వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదాన్ని లెక్కచేయకుండా వాగును దాటించి అవతలి వైపునకు తీసుకెళ్లారు.అక్కడి నుంచి కెరమెరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు రామేశ్వరిని పరీక్షించి గర్భంలోని శిశువు కదలికలు లేకపోవడాన్ని గుర్తించారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆసిఫాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం రామేశ్వరి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

### అత్యవసరమైతే.. అవస్థలే!

గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం వచ్చినా, గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినా, పాముకాటు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా గ్రామస్థులకు రవాణా పెద్ద సమస్యగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు మరింత కష్టతరమవుతున్నాయి. వాహనాలు వెళ్లేందుకు అనుకూలమైన రహదారులు లేకపోవడంతో రోగులను కుటుంబ సభ్యులే మోసుకుంటూ వాగులు దాటించాల్సిన పరిస్థితి నెలకొంది.

### రోడ్డు లేదు.. వంతెన లేదు.. డోలీయే దిక్కు!

కొలంగూడతో పాటు మారుమూల గ్రామాలకు మెరుగైన రహదారి, వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు ఎన్నోసార్లు కోరుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతమవుతోందని చెబుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ గ్రామానికి చేరుకోలేని పరిస్థితి ఉంటే.. రోగిని ముందుగా వాగు దాటించి, ఆ తర్వాతే వాహనంలో ఆసుపత్రికి తరలించాల్సి వస్తోందని వాపోతున్నారు.

### అభివృద్ధి మాటలు సరే.. పరిష్కారం ఎప్పుడు?

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, కొలంగూడ వంటి గ్రామాల్లో మాత్రం ప్రాథమిక సమస్యలు ఇంకా వెంటాడుతున్నాయని స్థానికులు అంటున్నారు. కనీసం అత్యవసర వైద్యం అందేలా రహదారి, వంతెన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు వాగులు దాటే పరిస్థితి లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గర్భిణిని వాగు దాటించి ఆసుపత్రికి తీసుకెళ్లిన ఈ ఘటన.. మారుమూల గ్రామాల్లో నెలకొన్న రవాణా సమస్యలకు అద్దం పడుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి గొరియాగూడ వాగుపై శాశ్వత రాకపోకల సౌకర్యం కల్పించి, గ్రామ స్థుల డోలి కష్టాలకు ముగింపు పలకాలని ప్రజలు కోరుతున్నారు.

# భూ సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు

**మంచిర్యాల, 12, ఆగస్టు (ప్రజాజ్యోతి):**జిల్లాలో భూ సమస్యలకు సంబంధించి అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీమారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన అదనపు కలెక్టర్.. భూ సమస్యకు సంబంధించి కేటాయించిన అంశంపై విచారణ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలపై అందిన దరఖాస్తులను సంబంధిత రికార్డుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట క్షేత్రస్థాయి లో విచారణ చేపట్టి, నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కోటపల్లి మండల తహసీల్దార్‌తో కలిసి మండలంలోని ఎం.ఎల్.ఎస్. పాయింట్‌ను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బియ్యం సరఫరాకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. రేషన్ డీలర్లకు బియ్యం సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పిడిఎస్ బియ్యం సరఫరా ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన మేరకు సకాలంలో బియ్యం సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల కొరత రాకుండా పకడ్బందీ చర్యలు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 12,( ప్రజా జ్యోతి)** జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నా మని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. వర్షాకాల సాగు నేపథ్యంలో బుధవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం పరిధిలోని యూరియా గోదామును, యూరియా బుకింగ్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో అందు బాటులో ఉన్న యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ వివరాలను కలెక్టర్ స్వ యంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతుల నమోదులు, బుకింగ్ విధానం, పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థా యిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బుకింగ్ ప్రక్రియలో రైతులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలని, యాప్ సమర్థవంతంగా పనిచేసేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా రైతుల అవసరా లకు అనుగుణంగా సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ బుకింగ్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ పూర్తిస్థాయి పారదర్శ కతతో జరుగుతోందని, దీంతో బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. ఎరువులను నిర్ణీత గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)కే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం లేదా పక్కదారి పట్టించడం వంటి చర్య లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని క లెక్టర్ హెచ్చరించారు. రైతులు తమకు అవసరమైన మేరకే ఎరువులను కొనుగోలు చేయాలని, ఒకేసారి అధిక మొత్తంలో నిల్వ చేసుకోవద్ద ని సూచించారు. సహకార సంఘాల ద్వారా ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్య వేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లాయం త్రాంగం అన్ని చర్యలు చేపడు తోందని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో పీ ఏ సీ ఎస్ సిబ్బంది పూర్ణచందర్, రైతులు తదితరులున్నారు.

# ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ



**లక్ష్మణ చాంద, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)** రైతులకు ఎరువులు పారదర్శకంగా అవసరానికి అనుగుణంగా సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ అనే నూతన డిజిటల్ విధానం అమలులోకి తెచ్చిందని వ్యవసాయ అధికారి బి నాగరాజు అన్నారు. బుధవారం రైతులతో మాట్లాడుతూ ఈ విధానంలో భాగంగా నేడు చిన్న చింతకుంట మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా, ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని రైతు వివరాలు, సాగు భూమి, పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందని దీనివల్ల రైతులకు అవసరమైన ఎరువుల ప్రణాళిక మరింత సమర్థవంతంగా రూపొందించబడటంతో పాటు పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవాలి అని అన్నారు. పంట వివరాలు నమోదు తప్పనిసరి. భూమి వివరాలు నమోదు పూర్తయిన తర్వాత రైతులు ప్రస్తుత సీజన్‌లో సాగు చేయబోయే పంటను తప్పనిసరిగా ఎంపిక చేయాలి. అనంతరం ఏ భూమికి ఎరువులు అవసరమో ఆ భూమిని ఎంపిక చేసి, ఆయా పంటలకు అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేయాలి అన్నారు. ఈ నూతన విధానం ద్వారా రైతుల వివరాలు, సాగు భూమి, సాగు పంట ఆధారంగా ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం సులభమవుతుంది. అలాగే ఎరువుల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా సాగేందుకు అవకాశం కలుగుతుంది. రైతులు తమ దరఖాస్తు స్థితిని యాప్ ద్వారా తెలుసుకోవడంతో పాటు క్యూ ఆర్ కోడ్ ద్వారా సులభంగా ఎరువులు పొందగలుగుతారని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైనట్లయితే, తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారీ ఏ ఈ ఓ లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చు అన్నారు.

## గాంధీ భవన్ లో పార్టీ బలో పేతం పై కీలక సమీక్ష

**పాల్గొన్న ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్**



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 12, (ప్రజా జ్యోతి )** హైదరాబాదు లోని గాంధీ భవన్ లో బుదవారం పార్టీ బలోపేతం పై కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఏఐ సీ సీ సెక్రటరీ సచిన్ సావంత్ తో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదిలాబాద్ డీసీ సీ అధ్య క్షులు డా. నరేష్ జాదవ్ 1 టు 1 సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప రిస్థితులు, పార్టీ బలోపేతా నికి చేపడుతున్న కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ ని మరింత బలోపేతం చేయాల్సిన అంశాలపై సమ గ్రంగా సమీక్షించారు. అలాగే గ్రామ, మండల స్థాయి నుం చి పార్టీని మరింత పటిష్టం చేయడం, కార్యకర్తలకు అండగా నిలవడం, ప్రజా సమ స్యలపై నిరంతరం పోరాడుతూ కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడం వంటి అంశాలపై చర్చిం చారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన సం స్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముం దుకు సాగాలని నిర్ణయించారు.

## రాచాపూర్ సర్పంచును పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**లక్ష్మణ చాంద, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)** ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న రాచాపూర్ సర్పంచ్ బూసి మహేష్ ను బుధవారం రోజున బీఆర్ ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ రామ్ కిషన్ రెడ్డి, బీఆర్ ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి ఆయన ను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో పీచర మాజీ సర్పంచ్ భూమేష్,నరేష్, ప్రసాద్, పండరి తదితర పార్టీ నాయకులు ఉన్నారు.

## చామన పల్లిలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



**లక్ష్మణ చాంద, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)** చామనపల్లిలో నూత నంగా విద్యుత్ స్తంభా లు ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామ స ర్పంచ్ ఐట్ల లక్ష్మి సుద ర్శన్ అన్నారు. బుధవా రం రోజున అవసరానికి అనుగుణంగా విద్యుత్ స్తంభాలను వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగారెడ్డి ఏఈ మహేష్, లైన్మెన్ తిరుపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

# పిల్లల అభ్యాసన సామర్థ్యాల పెంపే లక్ష్యం






జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 12,( ప్రజా జ్యోతి )** విద్యార్థుల్లో ప్రాథమిక అక్ష రాస్యత, సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు.బుధవారం జిల్లా పరిషత్ సమావేశ హాల్ లో జిల్లాలోని 176 కాంపిటెంట్ పాఠశాలల ప్రధానోపాధ్యా యులు కాంప్లెక్స్ హెచ్ఎంలు, మండల విద్యాశాఖాధి కారులతో ఎఫ్ఎల్ ఎన్ కార్యక్రమాలు, పిల్లల అభ్యాస న సామర్థ్యాల పెంపుపై సు దీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దే శించుకుని, వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పాఠ శాలల్లో చేపట్టిన బేస్‌లైన్ టెస్టు నివేదికలను ఒకటి, రెండు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో తప్పని సరిగా సబ్మిట్ చేయాలని సూచించారు. అభ్యాస న పురోగతిని పర్యవేక్షించేందుకు స్పష్టమైన క్యాలెండర్‌ను ప్రకటించారు. ప్రతి నెల 26వ తేదీన పాఠశాల స్థాయిలో హెచ్ఎం, ఉపాధ్యా యులతో సమీక్ష జరిపి విద్యార్థుల ప్రగతిని నిర్ధారిం చుకోవాలన్నారు. అలాగే ప్రతి నెల 27న ఎంఈఓల సమక్షంలో మండల స్థాయి సమీక్ష నిర్వహించాలని తెలిపారు. ప్రతి నెల 28వ తే దీన జిల్లా కలెక్టర్ అధ్యక్షతన హెచ్ఎంలు, ఎంఈఓల తో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి వచ్చే ఉపా ధ్యాయులు తమ పాఠశాల ఎఫ్ఎల్ఎన్ నివేదికలతో హాజరు కావాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, ఏఎంఓ లక్ష్మణ్, అజయ్, సీఎంఓ తిరుపతితో, రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు నిఖిల్, వెంకటేష్, నికిత తదితరులు పాల్గొ న్నారు.

# నూతన ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ

వ్యవసాయ అధికారి బి.నాగరాజు

**లక్ష్మణ చాంద, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)** రైతులకు ఎరువులు పారదర్శకంగా అవసరానికి అనుగుణంగా సులభతరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ అనే నూతన డిజిటల్ విధానం అమలులోకి తెచ్చిందని వ్యవసాయ అధికారి బి నాగరాజు అన్నారు. బుధవారం రైతులతో మాట్లాడుతూ ఈ విధానంలో భాగంగా నేడు చిన్న చింతకుంట మండలంలోని రైతులకు ఎరువుల పంపిణీ పూర్తిగా ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానానికి భిన్నంగా, ఇకపై రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని రైతు వివరాలు, సాగు భూమి, పంట వివరాలు, అవసరమైన ఎరువుల సమాచారం ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రక్రియ జరుగుతుందని దీనివల్ల రైతులకు అవసరమైన ఎరువుల ప్రణాళిక మరింత సమర్థవంతంగా రూపొందించబడటంతో పాటు పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు.రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకోవాలి అని అన్నారు.పంట వివరాలు నమోదు తప్పనిసరి.భూమి వివరాలు నమోదు పూర్తయిన తర్వాత రైతులు ప్రస్తుత సీజన్‌లో సాగు చేయబోయే పంటను తప్పనిసరిగా ఎంపిక చేయాలి.అనంతరం ఏ భూమికి ఎరువులు అవసరమో ఆ భూమిని ఎంపిక చేసి, ఆయా పంటలకు అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేయాలి అన్నారు. ఈ నూతన విధానం ద్వారా రైతుల వివరాలు, సాగు భూమి, సాగు పంట ఆధారంగా ఎరువుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం సులభమవుతుంది. అలాగే ఎరువుల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా సాగేందుకు అవకాశం కలుగుతుంది. రైతులు తమ దరఖాస్తు స్థితిని యాప్ ద్వారా తెలుసుకోవడంతో పాటు క్యూ ఆర్ కోడ్ ద్వారా సులభంగా ఎరువులు పొందగలుగుతారని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైనట్లయితే, తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారీ ఏ ఈ ఓ లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చు అన్నారు.




## ఆదివాసీ సాహిత్యవేత్త మెస్రం మనోహర్ ని సన్మానించిన ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఆగస్టు 12( ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నియోజకవర్గం లోని ఊట్నూర్ ప్రభుత్వ గిరిజన బి. ఎడ్ కళాశాల మాజీ ప్రిన్సిపల్,ఆదివాసీ సాహిత్యవేత్త మెస్రం మనోహర్ ని బుధవారం ఉదయం ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెడ్మ బొజ్జు పటేల్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.గిరిజన విద్యాభివృద్ధికి,సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సన్మానించి అభినందించడం,గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీ రచయితలను అభినందించడం,ప్రజా ప్రభుత్వంలో ఆదివాసీలకు దక్కుతున్న గౌరవం అని ఎమ్మెల్యే బొజ్జు అన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే షాపు లైసెన్స్ రద్దు



**లక్ష్మణ చాంద,ఆగస్టు 12 (ప్రజా జ్యోతి)** కిరాణా షాపుల యజమానులు సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, ఒకవేళ నియమాలను ఉల్లంఘిస్తే వ్యాపార లైసెన్స్ తో పాటు 5000 రూపాయల జరిమానాన్ని కూడా విధించబడు తుందని స్థానిక ఎంపీడీవో వనజ అన్నారు. బుధవారం రోజు న గ్రామంలోని కిరాణా షాపులను తనిఖీ చేసి వారికి ప్రత్యేక నోటీసులను అందజేశారు. 100 మైక్రాల కంటే కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను, గాని ప్లేట్లను, టీ కప్పులను వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ నసీరుద్దీన్ స్థానిక సర్పంచ్ లక్ష్మీ సుదర్శన్, ఉప సర్పంచ్ గంగారెడ్డి, కార్యదర్శి గంగా సాగర్, కిరాణా షాప్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ బియ్యాన్ని ఆక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరి బైండోవర్



**జన్నారం,ఆగస్ట్12(ప్రజాజ్యోతి)** పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరినీ బుధవారం తాసిల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.ఖానాపూర్ మండలం సూర్జాపూర్ గ్రామానికి చెందిన కడమంచి లక్ష్మణ్, లక్ష్మణచాంద మండలం వద్యాల గ్రామానికి చెందిన గంధం నరేష్ లు పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి ,భవిష్యత్తు లో ఇలాంటి నేరాలకు నిరోధించడానికి మరియు సత్ప్రవర్తన కొనసాగించేలా చర్యలు తీసుకునేలా భావించి జన్నారం మండల తహసీల్దార్ బక్కయ్య సమక్షంలో బైండోవర్ చేసినట్లు ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

# సౌభాగ్యం.. ఆధ్యాత్మిక శోభ శ్రావణ లక్ష్మి శుభారంభం!

## నేడే మరమ పవిత్రమైన శ్రావణ మాసారంభం లక్ష్మీదేవికి, శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైనది

## పల్లెల నుంచి పట్టణాల వరకు ప్రతీ ఇల్లూ ఆలయాన్ని తలపించేలా ఉండే మాసం



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 13 ,( ప్రజాజ్యోతి ).**తెలుగువారి ఇళ్లలో ఆధ్యాత్మిక వెలుగులు నింపే అత్యంత పవిత్రమైన 'శ్రావణ మాసం' ప్రారంభమవుతోంది. వర్షరుతువులో వచ్చే ఈ మాసం లక్ష్మీదేవికి, పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైనది. మాసమంతా పూజలు, నోములు, వ్రతాలు, మంగళహారతులతో ముత్తైదువుల కోలాహలం, ఆధ్యాత్మిక శోభ ఊరూ వాడా సంతరించుకోనుంది. పల్లెల నుంచి పట్టణాల వరకు ప్రతీ ఇల్లూ ఆలయాన్ని తలపించేలా ఈ మాసంలో వాతావరణం రూపాంతరం చెందుతుంది.



**శ్రావణ మాస నామకరణ విశేషం**

శ్రవణా నక్షత్రంతో కూడుకున్న పౌర్ణమి వచ్చే మాసం కాబట్టి దీనికి 'శ్రావణ మాసం' అని పేరు వచ్చింది. శ్రవణా నక్షత్రం శ్రీమహా విష్ణువు జన్మ నక్షత్రం కావడంతో ఈ నెలలో విష్ణు ఆరాధన, శ్రీ వేంకటేశ్వరస్వామి సేవ విశేష ఫలితాలనిస్తుంది. లక్ష్మీదేవి భూమిపై అవతరించిన పవిత్ర సమయాలలో శ్రావణ మాసం ముఖ్యమైనదని పురాణాలు చెబుతున్నాయి.

**శ్రావణ మాసంలో ముఖ్యమైన పండగులు -- విశిష్టతలు**

**మంగళ గౌరీ వ్రతం**

శ్రావణ మాసంలో వచ్చే ప్రతి మంగళవారం అత్యంత పవిత్రమైనది. కొత్తగా వివాహమైన నవవధువులు తమ పసుపు కుంకుమలు నిరంతరం వర్ధిల్లాలని, దీర్ఘసుమంగళీ ప్రాప్తం కలగాలని పార్వతీదేవిని 'మంగళ గౌరి'గా ఆరాధిస్తూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఐదేళ్ల పాటు ఈ వ్రతాన్ని క్రమం తప్పకుండా చేసి ఉద్యాపన చెప్పుకోవడం మన ఆచారం.

**వరమాలక్ష్మి వ్రతం**

శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని 'వరలక్ష్మీ వ్రతం'గా ఘనంగా జరుపుకుంటారు. అష్టలక్ష్మి స్వరూపిణి అయిన లక్ష్మీదేవిని కలశంలో ఆవాహన చేసి, తోరాలను ధరించి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ రోజున పదిమంది ముత్తైదువులను పిలిచి తాంబూలాలు ఇవ్వడం వల్ల సకల ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తారు.

**శ్రావణ సోమవారాలు (శివారాధన)**

ఈ మాసంలో సోమవారాలు పరమశివునికి ఎంతో ప్రీతిపాత్రమైనవి. ఉదయాన్నే ఉపవాసాలు ఉండి భక్తులు శివాలయాలకు తరలివెళ్తారు. విభూతి, బిల్వపత్రాలతో పరమేశ్వరుడిని అర్చించి అభిషేకాలు జరిపిస్తే మనశ్శాంతి లభించడమే కాక సమస్త పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు.

**రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్)**

శ్రావణ పౌర్ణమి నాడు సోదరసోదరీమణుల అనురాగానికి, ఆప్యాయతకు ప్రతీకగా రక్షాబంధన్ వేడుకను జరుపుకుంటారు. అక్కచెల్లెళ్లు తమ అన్నదమ్ముల ముఖాన తిలకం దిద్ది, చేతికి రక్షణగా తోరం (రాఖీ) కట్టి ఆశీర్వాదాలు పొందుతారు. అలాగే ఇదే రోజున వేద విద్యార్థులు యజ్ఞోపవీత ధారణ (జంధ్యాల పండుగ) చేసుకుంటారు.

**శ్రీకృష్ణాష్టమి (గోకులాష్టమి)**

శ్రావణ బహుళ అష్టమి నాడు లోకరక్షకుడైన శ్రీకృష్ణుడు జన్మించాడు. ఈ సందర్భంగా ఇళ్లలో, వీధుల్లో ఉట్టి కొట్టే సంబరాలు, చిన్న పిల్లలను బాలకృష్ణుడి రూపాల్లో అలంకరించడం విశేషంగా ఆకట్టుకుంటుంది.

**ఆరోగ్య, సామాజిక కోణం:**

శ్రావణ మాసం కేవలం ఆధ్యాత్మికానికే పరిమితం కాదు; ఇందులో గొప్ప సామాజిక, ఆరోగ్య కోణాలు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ఇళ్లను శుభ్రం చేసుకుని తోరణాలతో అలంకరిస్తారు. నోములు, పేరంటాల పేరుతో ఒకరింటికి ఒకరు వెళ్లడం వల్ల బంధుత్వాలు, స్నేహాలు బలపడతాయి. ప్రకృతి పచ్చదనంతో అలరారే ఈ సమయంలో ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను అందిస్తుంది.ప్రకృతి పరవశించే ఈ పవిత్ర శ్రావణ మాసంలో ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు కలగాలని కోరుకుందాం.


-ఇందూర్తి ఆచార్య కళ్యాణ్ అద్యాపకులు ,జ్యోతీష్యులు ,పురోహితులు .

# పోలీసు కొలువులకు ఉచిత శిక్షణ

**ఆసిఫాబాద్ జిల్లాలో 139 పోస్టులు.. 15న ప్రవేశ పరీక్ష**

**పేద, గ్రామీణ, గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలి**

**: ఎస్పీ నితికా పంత్**



**ఆసిఫాబాద్ఆగష్టు 12 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసుశాఖ, ఎస్పీఎఫ్, జైళ్ల శాఖ తదితర విభాగాల్లో 7,437 ఉద్యోగాల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసుశాఖ నిరుద్యోగ యువతకు ఉచిత రెసిడెన్షియల్ పోలీసు రిక్రూట్‌మెంట్ కోచింగ్ అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ బుధవారం తెలిపారు.జిల్లాలో సివిల్ కానిస్టేబుల్ 87, ఏఆర్ కానిస్టేబుల్ 40, ఫైర్ ఫైటర్స్ 9, జైల్ వార్డర్ 3 కలిపి మొత్తం 139 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఫిజికల్ ట్రైనర్లతో తరగతులతో పాటు శారీరక శిక్షణ, ఉచిత వసతి తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. పోలీసు ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీప పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 15న ప్రవేశ పరీక్ష నిర్వహించి, ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారికి కోచింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ప్రారంభ తేదీ, స్థలం, ఇతర వివరాలను తర్వాత వెల్లడిస్తామన్నారు. పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి శిక్షణ పొంది పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని ఎస్పీ నితికా పంత్ ఆకాంక్షించారు.

# 91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో విద్యను కాపాడేందుకు పోరాడుదాం

**నూతన జాతీయ విద్యా వి ధానం 2020ను వ్యతిరేకి ద్దాం**

**ఏఐఎస్ఎఫ్ ఆదిలాబాద్ జి ల్లా సమితి ఆధ్వర్యంలో ఘ నంగా 91వ ఆవిర్భావ ది నోత్సవం**

**మేస్రం భాస్కర్ , ఏఐఎస్ ఎ ఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షు లు**





**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 12, (ప్రజా జ్యోతి )** 91 ఏళ్ల విద్యార్థి ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ విద్యను కాపాడేందుకు పోరాడుదామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేస్రం భాస్కర్ పిలుపు ని చ్చారు. ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం సం దర్భంగా ఆదిలాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏ ఐ ఎస్ఎఫ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యార్థి సంఘ జెండాను మేస్రం భా స్కర్ ఎగురవేశారు. అనంత రం మిఠాయిల పంచి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సం దర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేస్రం భాస్కర్ మాట్లాడుతూ 12 ఆగస్టు 1936న ఉత్తర్ ప్రదే శ్ రాష్ట్రం, లక్నో నగరం బె నారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వ హించుకుంటున్న మొట్ట మొదటి విద్యార్థి సంఘం ఏ ఐఎస్ఎఫ్ అని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో విద్యార్థులను ఐక్యం చేసి బ్రి టీష్ సామ్రాజ్యవాదానికి వ్య తిరేకంగా పోరాడిన ఏఐ ఎ స్ ఎఫ్, నాటి నుంచిఉచిత, నాణ్యమైన విద్య, సామాజి క న్యాయం, ప్రజాస్వామ్యం, శాస్త్రీయ దృక్పథం కోసం నిరంతరం పోరాడుతోంద న్నారు. "చదువు--పోరాడు" అనే నినాదంతో విద్యార్థుల హక్కుల కోసం సాగిన 91 ఏళ్ల ఉద్యమ స్ఫూర్తిని కొన సాగిస్తూ, విద్యార్థుల భవి ష్యత్తును కాపాడేందుకు మ రింత బలమైన ఉద్యమాల ను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన జా తీయ విద్యా విధానం-- 20 20 ను వ్యతిరేకించాలని వా రు పిలుపునిచ్చారు . ఎన్ ఈ పీ పేరుతో విద్యా రంగం లో కేంద్రీకరణ, ప్రైవేటీకర ణ, కార్పొరేటీకరణకు మా ర్గం సుగమం చేసి, పేద-- మ ధ్య తరగతి విద్యార్థులకు విద్యను మరింత భారంగా మార్చే ప్రమాదం ఉందని ఆయన విమర్శించారు. ప్ర భుత్వ విద్యాసంస్థలకు ని ధులు పెంచి బలోపేతం చే యాల్సిన సమయంలో వి ద్యా రంగాన్ని మార్కెట్ శక్తు లకు అప్పగించే విధానాల నుఉపసంహరించుకోవాలని, ఉచిత--నాణ్యమైన వి ద్య, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌ కర్యాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు . ఏఐ ఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో దేశవ్యా ప్తంగా విద్యార్థులు ఐక్యమై నూతన జాతీయ విద్యా వి ధానానికి వ్యతిరేకంగా, ప్ర భుత్వ విద్య పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, యైశాలి, మాణిక్, శైలజ, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర బైక్ దొంగతనాల ముఠా గుట్టురట్టు

**వరుస బైక్ దొంగతనాలకు చెక్ పెట్టిన జిల్లా పోలీసులు నిందితుల నుంచి 44 ద్విచ క్రవాహనాలు స్వాధీనం**

**5 గురు దొంగలు, 3 గురు దొంగ బండ్లు కొనుగోలు చేసి న వ్యక్తులు అరెస్ట్**

**5 గురు దొంగలు, 23 మంది ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన వారిపై కేసులు నమోదు**

**ఇచ్చోడ, ఆదిలాబాద్, నిర్మ ల్, నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో బైక్‌ల చోరీ**

**దొంగిలించిన వాహనాల నం బర్ ప్లేట్లు మార్చి విక్రయం వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**






**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 12, (ప్రజా జ్యోతి )** వరుస బైక్ దొంగతనాలకు చెక్ పెట్టి ఆదిలాబాద్ పోలీ సులు అంతర్ రాష్ట్ర బైక్ దొంగత నాల మూఠా గుట్టు రట్టు చేశారు. ఆదిలాబాద్ పోలీ సులు అరెస్టు చేసిన దొంగల వివరాలు ఇలా ఉ న్నాయి. మారంపెల్లి అనిల్ (21), సంజీవ్, చించోళి గ్రామం, ఇచ్చోడ మండలం. షేక్ షబ్బీర్ (39), మ హమ్మద్, చించోళి గ్రామం. షేక్ ముస్తాషాహిద్ (36), షేక్ కరీం, కేశవపట్నం. మహమ్మద్ జాకీర్ (55), మహమ్మద్ అనీఫ్, సిరి కొండ గ్రామం, మండలం మ హమ్మద్ షఫీ (37), అజీజ్, సిరికొండ గ్రామంలను పోలీసులు అరేస్ట్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్ర పరిసర ప్రాంతా ల్లో వరుస బైక్ దొంగతనాల కు పాల్పడుతున్న అంత ర్రా ష్ట్ర ముఠాను అరెస్టు చేసి వారి ఆటలను కట్టడి చేసిన ట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా స మావేశంలో కేసు వివరాల ను ఎస్పీ వెల్లడించారు.ఇ చ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ద్విచక్ర వా హనాల దొంగత నాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీ సులు, సిసిటీవీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు, విశ్వ సనీయ సమా చారం ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.గత 6 వ తేదిన సాయంత్రం 5 గంటల ప్రాంతంలో శుభాష్ నగర్ కాలనీ, ఇచ్చోడకు చెందిన ధరాడే బాలాజీ, విట్టల్ రావు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 05 న రాత్రి తన ఇంటి ఆవరణలో పార్క్ చేసిన తన మోటా ర్ సైకిల్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా ఇచ్చో డ ఎస్‌హెచ్‌ఓ తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితు లు గత కొంతకాలంగా మరికొందరితో కలిసిము ఠాగా ఏర్పడి అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇచ్చోడ, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతో పాటు మహారా ష్ట్ర పరిసర ప్రాంతాల్లో సు మారు 44 ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు వెల్ల డించారు.దొంగిలించిన వా హనాల నంబర్ ప్లేట్లను మార్చి, ఇతరులకు విక్రయించి లాభం పొందినట్లు విచార ణలో వెలుగులోకి వచ్చింది. నిందితుల సమాచారం మేరకు పోలీసులు 44 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వాహనాలను కొనుగోలు చేసిన గుండాల, కేశవపట్నం గ్రామాలకు చెందిన నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి. ముజాహిద్, కరీమ్ కేశవపట్నం.(అరెస్టు) ఇక్బాల్, పీర్ మహమ్మద్ గుండాల. (అరెస్టు) కరీం,మహమ్మద్, కేశ వపట్నం (అరెస్టు)వీరిలో 3 మంది దొంగిలించిన వాహ నాలను కొనుగోలు చేసినం దుకు అరెస్టు చేయగా, మిగిలిన వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగి స్తున్నారు. ఇంకా సుమారు 20 మంది వాహనాలను కొనుగోలు చేసిన వారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది అని, గతంలో జరిగిన ఇతర ద్విచక్ర వాహనాల దొంగతనాలపై కూడా పోలీసులు దర్యాప్తు చే స్తున్నారు. వాహన యజమానులు తమ ద్విచక్ర వా హనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసి తప్పనిసరిగా తాళాలు వేయాలని, వీలై నంత వరకు సీసీటీవీ కెమె రాలు ఉన్న ప్రదేశాల్లోనే వా హనాలను పార్క్ చేయాలని ఎస్పీ సూచించారు. అను మానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఇచ్చోడ పోలీసులు సాంకేతి క ఆధారాలతో చాకచక్యంగా దర్యాప్తు చేసి అంతర్రా ష్ట్ర బైక్ దొంగతనాల ముఠా ను పట్టుకుని 44 ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీ ఎస్, ఇచ్చో డ ఎస్‌హెచ్‌ఓ కె. నరేష్ కుమార్, సీసీఎస్ ఇన్ స్పెక్టర్ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రికవరీ చేసిన డబ్బులు వెంటనే చెల్లించాలి.

**'నో వర్క్.. నో పేమెంట్' సర్క్యులర్ జారీ చేయాలి - సివిల్ కాంట్రాక్టర్లు.**



**మందమర్రి, ఆగష్టు 12 ( ప్రజాజ్యోతి ):**సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుల ఒకరోజు వేతనానికి సంబంధించి కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేసిన డబ్బులను వెంటనే తిరిగి చెల్లించాలని సివిల్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో కొంగల తిరుపతిరెడ్డి, బర్ల సదానందం మాట్లాడారు.ఫిబ్రవరిలో జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు కాంట్రాక్ట్ సివిల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. కార్మికులు సమ్మెకు వెళ్లడం వారి నిర్ణయం కాదని, యూనియన్ నాయకుల పిలుపు మేరకే సమ్మెలో పాల్గొన్నారని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి సమ్మెల సందర్భంగా 'నో వర్క్. నో పేమెంట్' సర్క్యులర్ జారీ అయిన వెంటనే రికవరీ చేసిన మొత్తాన్ని కాంట్రాక్టర్ల కు తిరిగి చెల్లించేవారని గుర్తుచేశారు.అయితే ఈసారి సమ్మె జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సంబంధిత సర్క్యులర్ జారీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు."పనులు లేక ఇప్పటికే నష్టాల్లో ఉన్నాం.. ఇప్పుడు మా నుంచి రికవరీ చేసిన డబ్బులు కూడా తిరిగి రాకపోతే కాంట్రాక్టర్ల పరిస్థితి ఏంటి?" అని ప్రశ్నించారు.సింగరేణి యాజమా న్యం వెంటనే 'నో వర్క్.. నో పేమెంట్' సర్క్యులర్ జారీ చేసి, కాంట్రా క్టర్ల నుంచి రికవరీ చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు సమస్యను త్వరగా పరిష్కరించి కార్మికులు, కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో సాగర్‌బాబు, వెంకటేష్, మల్లేష్, వేణుకుమార్, శ్రీనివాస్, నర్సయ్య, ప్రభాకర్, పరశు రాములు పాల్గొన్నారు.

## నూర్‌నగర్--చిర్రకుంట రోడ్డులో కుక్కల బెడద

**ప్రజల భద్రతపై దృష్టి సారించాలి**



**ఆసిఫాబాద్ ఆగష్టు 12 ప్రజా జ్యోతి** ఆసిఫా బాద్ మునిసిపల్ పరిధిలోనీ నూర్‌నగర్--చిర్రకుంట రోడ్డులో వీధి కుక్కల సంఖ్య పెరిగిపోవడంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహేరా భాను తెలిపారు. కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.రాత్రి వేళల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రోడ్డుపై వెళ్లే వారిని వెంటపడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. కుక్కలు కరిచేందుకు ప్రయత్నిస్తుండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. కుక్కల అరుపులతో రాత్రివేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యానికి ముప్పు కలగకుండా మున్సిపల్ అధికారులు వెంటనే వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని డాక్టర్ సహేరా భాను కోరారు. అవసరమైన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## దిశా మోడల్ స్కూల్ లో విద్యార్థులకు బ్యాగులు అంగన్‌వాడి పిలలకు యూనిఫార్మ్ పశీపిని.







**కాసిపేట, 12 ఆగస్టు (ప్రజాజ్యోతి):**ఈ రోజు తాటిగూడ గ్రామపంచాయతీ లోని దిశ మోడల్ స్కూల్ విద్యార్ధులకు ఉచితంగ పాఠశాల బ్యాగులు మరియు అంగన్‌వాడి పిలాలకు యూనిఫాం లా తాటిగూడ సర్పంచ్ వెంకటేష్ పంపిని చెయ్యడం జరిగింది ..ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతు ప్రభుత్వశీ అందిస్థున్న సంక్షేమ ఫలాలను విద్యార్థులు సాధ్వినియోగ పరుచుకోవాలని అన్నారు.అంగన్‌వాడి కేంద్రల ద్వార చిన్న పిల్లకు పోషకాహారం తో పాటూ ముంధాస్తు విద్యా మెరుగు పడుతుంధాని, మోడల్ స్కూల్ ల ద్వార విద్యార్ధులకు నాన్యమైన విద్య అందుతుందని,తల్లీ తండ్రులు తమా పిలలాను క్రమశీ తప్పకుండ పాఠశాల కు పంపి వారిని ఉన్నత విద్యా వంతూలు గా తిర్చి దిద్దలాని కొరారు..ఈ కార్యక్రమములో సర్పంచ్ మాడా వి వెంకటేష్ ఉపసర్పంచ్ తమ్మి నేడి విజయ లక్ష్మి, ఉపాధ్యాయులు మాంగా రామదేవి ,విద్యార్థులు పాల్గొన్నా రు...

## నశాముక్త భారత్.. నశాముక్త తెలంగాణే లక్ష్యం

**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి:**

**వసుధైక, మా కేథినేని ఫౌండేషన్లు**

**హైదరాబాద్:** నశాముక్త భారత్, నశాముక్త తెలంగాణ నినాదంతో వసుధైక ఫౌండేషన్, మా కేథినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సామాజిక సంస్థల సహకారంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ ఫోర్స్, ఓం శాంతి, రెడ్‌క్రాస్, బ్రహ్మకుమారీస్, ఈగిల్ టాస్క్‌ఫోర్స్, మిలీనియం నవభారత్ నిర్మాణం, యూ ఫార్మర్స్, బ్రెయిన్ కోర్ట్, ది లా మిత్రా తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమీర్ పేట్ మాజీ కార్పొరేటర్ కేతినేని సరళ, అతిథులు ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణులు, ఈగిల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు లతో కలిసి మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అవగాహన కల్పించాలి: యువతలో మానసిక ఒత్తిడి, ఆత్మవిశ్వాసం లోపించడం వంటి సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సామాజిక సంస్థలు కలిసి యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. "మనమందరం కలిసే భారతదేశం.. మనమందరం కలిసే తెలంగాణ. తెలంగాణ యువత మత్తుకు దూరంగా ఉండాలి" అని నిర్వాహకులు స్పష్టం చేశారు. నశాముక్త భారత్, నశాముక్త తెలంగాణ ఉద్యమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు, యువత సహకరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. యువతను బలోపేతం చేసి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## పాల్వంచలో ఒకేరోజు రెండు చోరీలు..

**లబోదిబోమంటున్న పట్టణవాసులు..**

**ఐదు తులాల బంగారం, రూ.30 వేల నగదు అపహరణ..**

**మార్కెట్ లో నాలుగు ఏసీలు చోరీ...**

**పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,పాల్వంచ పట్టణంలో ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో దొంగతనాలు జరిగిన ఘటన ప్రజల్లో ఒక్కసారిగా భయాందోళన రేపింది. పట్టణంలోని ఒడ్డుగూడెం ప్రాంతంలో ఓ ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని దుండగులు సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు పట్టణంలోని మార్కెట్ పరిధిలో నాలుగు ఏసీ మిషన్ లు చోరీకి గురైనట్లు కేసు నమోదైంది. వాణిజ్య సముదాయం లేదా సంబంధిత ప్రాంగణంలో అమర్చిన ఏసీ యూనిట్లను రామవరం కు చెందిన నలుగురు మహిళల దొంగలు దొంగతనం చేసినట్లు సమాచారం. వారు దొంగతనం చేసిన ఏసీ యూనిట్లను ధ్వంసం చేసి పట్టణంలోని పాత ఇనుప కొట్టులలో అమ్మినట్లు సమాచారం. వాటి విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందని అంచనా..ఒకేరోజు పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు జరగడంతో స్థానికుల్లో భయాందోళన మొదలైంది. వరుస చోరీల నేపథ్యంలో రాత్రి వేళల్లో పోలీసుల గస్తీని మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు. రెండు ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి, సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలో ఎవరైనా అనుమానితులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎప్పటికప్పుడు పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని పట్టణ ఎస్సై టి నాగరాజు తెలిపారు

## ఈ నెల 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే విధానం

**ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్**

**హైదరాబాద్** హైదరాబాద్లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్వే విధానం ఆగస్టు 18 నుంచి అమలు లోకి కానుందని నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడుతూ హెచ్ సిటీ తిబిఎ ప్రాజెక్ట్ పనుల నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకున్నాం. కేబీఆర్ చుట్టూ ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకే వన్వే. ఇప్పటికే రెండుసార్లు పైలట్ ట్రయల్స్ నిర్వహించామని అన్నారు. ఏప్రిల్ 5, జూన్ 21న పైలట్ ట్రయల్స్ నిర్వహణ జరిగింది. కీలక ప్రాంతాల్లో రోడ్ మార్కింగ్లు,సైన్ బోర్డులు వుంచాం. నాలుగు షిఫ్టులో ట్రాఫిక్ సిబ్బంది మోహరింపు వుంటుంది. సిసిటీవీలతో 24 గంటలూ ట్రాఫిక్పై నిఘా వుంటుంది. డ్రోన్లతో రియల్టైమ్ ట్రాఫిక్ మానిటరింగ్ చేస్తామని అన్నారు. గూగుల్ మ్యాప్స్, నావిగేషన్ రూట్లలోనూ మార్పులు చేసాం. దాదాపు రెండేళ్ల పాటు వన్వే విధానం అమలు లొ వుంటుంది. రాంగ్సైడ్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు వుంటాయి. కొత్త ట్రాఫిక్ విధానానికి వాహనదారులు సహకరించాలని అన్నారు.

## భజన బృందానికి సన్మానం

**చంద్రుగొండ** : వారం రోజుల క్రితం భద్రాచలంలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల భజన పోటీలలో పోకలగూడెం భజన భక్త బృందం రెండవ బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం పోకల గూడెం గుడి ఆవరణంలో ఆలయ చైర్మన్ మేడిపోయిన లక్ష్మణ్ వారిని సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే పోకలగూడెం భజన బృందం రెండో స్థానం కైవసం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో ఇంకా మంచి స్థాయికి ఎదిగి మరెన్నో విజయాలు లభించి గ్రామ పేరు, ప్రతిష్టను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భజన బృందం సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## శాతవాహన పీజీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన వీసీ

**కరీంనగర్** కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న పీజీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించేందుకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ తో కలిసి విశ్వవిద్యాలయ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష గదులను సందర్శించి, హాల్ టికెట్లు, సీటింగ్ ఏర్పాట్లు, హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, చీఫ్ సూపరింటెండెంట్లుకు పలు కీలక సూచనలు చేస్తూ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని మాల్ ప్రాక్టీస్/ కాపీయింగ్ కు ఎలాంటి తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చూడాలని సూచించారు. తనిఖీ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సిద్దిపేట :** ప్రభుత్వ భూములను ఆక్రమణలకు గురికాకుండా, వాటికి సర్వే నిర్వహించి హద్దులు పెట్టి, చుట్టూ ఫెన్సింగ్ వేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తహసిల్దార్ లను ఆదేశించారు రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని 265 సర్వే నెంబర్ లో గల 6 ఎకరాలు, రాయపోల్ మండల కేంద్రంలోని 729 సర్వే నంబర్ లో గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాలను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లా లో అన్ని మండలాల్లో ప్రభుత్వ స్థలాల రికార్డు లను పరిశీలించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఆ ప్రాంతంలో ప్రభుత్వం స్థలం ఎంత, ఎంత ఆక్రమణకు గురైన పూర్తి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ప్రభుత్వ భూమి చుట్టూ పకడ్బందీగా సర్వే నిర్వ హించి హద్దులు పెట్టుకుని చుట్టూ ఫెన్సింగ్ వెయ్యాలని తహసీల్దారులను ఆదేశించారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 7,437 పోలీస్ ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో

**జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీసు రిక్రూట్‌మెంట్ కోచింగ్**

**యువతి/యువకులకు బంగారు అవకాశం – సమీప పోలీస్ స్టేషన్ లో పేర్లు నమోదు చేసుకోవాలి:**

**పేద, గ్రామీణ, మారుమూల ప్రాంతాల యువతి/యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి:**

**కొమురం భీం, ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి నితికా పంత్:**




**ఆగస్టు12, సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ, ఎస్పీఎఫ్ జైళ్ల శాఖ (ప్రీసన్స్) తదితర విభాగాల్లో సుమారు 7,437ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో, కొమురం భీం,ఆసిఫాబాద్ జిల్లా యువతి/యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా జిల్లా పోలీసు శాఖ ఉచిత శిక్షణ కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. జిల్లాలో మొత్తం 139 పోస్టులకు సివిల్ కానిస్టేబుల్ 87, ఏ ఆర్ కానిస్టేబుల్ 40, ఫైర్ ఫైటర్స్ 09, జైల్ వార్డర్ 03 పోస్టులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ నీతిక పంత్ తెలిపారు.

**విద్యార్హతలు:** యువతఇంటర్మీడియట్, పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఉండాలి.

అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన అధ్యాపకులు అదేవిధంగా ఫిజికల్ ట్రైనర్లతో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ నీతిక పంత్ తెలిపారు. ఈ కోచింగ్‌లో ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణ, వసతి సౌకర్యం అందించబడుతుందని అన్నారు. జిల్లాలో ముఖ్యంగా పేద, గ్రామీణ, గిరిజన అదేవిధంగా మారుమూల ప్రాంతాల యువతీ/యువకులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా పోలీసు శాఖ, ఎస్పీ నీతిక పంత్ కోరారు. పోలీసు శాఖలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 15 ఆగష్టు 2026 న ఒక ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో ఎన్నికైన వారికీ ఈ సౌకర్యం కల్పించనున్నట్లు జిల్లా ఎస్పీ నీతిక పంత్ తెలిపారు. ఎన్నికైన వారికీ కోచింగ్ ప్రారంభ తేదీ, స్థలం అదేవిధంగా ఇతర పూర్తి వివరాలను తెలియజేస్తామని అన్నారు. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగ యువతీ యువకులను సూచించారు. కష్టపడి శ్రమించి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎస్.పి నీతిక పంత్ యువతి,యువకులను తెలియ జేస్తున్నామని అన్నారు.